ములకలచెరువు మీదుగా నడుస్తున్న ప్యాసింజర్ రైళ్లు



నాలుగు ప్యాసింజర్ రైళ్లు రద్దు

● నేటి నుంచి కుంభమేళాకు మళ్లింపు

ములకలచెరువు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి ములకలచెరువు మీదుగా గుంతకల్లు జంక్షన్‌కు నడిచే నాలుగు ప్యాసింజర్ రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగే కుంభమేళాకు నాలుగు రైళ్లను మళ్లించారు. దీంతో రెండు నెలల పాటు ఈ మార్గంలో నడిచే ప్యాసింజర్ రైళ్లు రద్దు కానున్నాయి. ఈ మేరకు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్గంలో ప్రతిరోజూ ఉదయం, రాత్రి వేళల్లో తిరుపతి-గుంతకల్లు జంక్షన్, గుంతకల్లు జంక్షన్-తిరుపతికి నాలుగు ప్యాసింజర్ రైళ్లు నడుస్తున్నాయి. నాలుగు రైళ్లను కుంభమేళాకు పంపనుండడంతో శని, ఆదివారం నుంచి రద్దు కానున్నాయి. శనివారం నుంచి ఉదయం నడిచే తిరుపతి-గుంతకల్లు జంక్షన్ (నెంబర్ - 07589)కు, రాత్రి నడిచే గుంతకల్లు-తిరుపతి (07655) రైళ్లు వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు రద్దు చేశారు. అలాగే ఆదివారం నుంచి ఉదయం నడిచే గుంతకల్లు జంక్షన్ నుంచి తిరుపతి (07590), రాత్రి నడిచే తిరుపతి-గుంతకల్లు (07656) రైళ్లు వచ్చే వచ్చే ఏడాది మార్చి 1వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐదు జిల్లాలతో పాటు కర్ణాటక ప్రయాణికులకు ఇబ్బందులు

తిరుపతి-గుంతకల్లు జంక్షన్ మధ్య నడిచే నాలుగు ప్యాసింబర్ రైళ్లను రెండు నెలల పాటు రద్దు చేయడంతో ఐదు జిల్లాలతో పాటు కర్ణాటక రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు తప్పవు. ఈ నాలుగు రైళ్లు అనంతపురం జిల్లా గుం తకల్లు జంక్షన్, గుట్టపాళ్యం, కల్లూరు జంక్షన్, గార్లదిన్నె, అనంతపురం, జం గాలపల్లె, శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం జంక్షన్, చిన్నకుంట్లపల్లె, ముదిగు బ్బ, మొలకవేమల, కాళసముద్రం, కదిరి, నల్లచెరువు, తనకల్లు, అన్నమ య్య జిల్లా ములకలచెరువు, తుమ్మణం గుట్ట, కురబలకోట, మదనపల్లె రో డ్, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు, పులిచెర్ల, చిత్తూరు జిల్లా మంగళంపేట, దామలచెరువు, పాకాల జంక్షన్, పనపాకం, కోటాల, తిరుపతి జిల్లా చంద్రగిరి, తిరుపతి పడమర, తిరుపతి రైల్వేస్టేషన్లలో ఆగుతాయి. ఈ రైళ్లలో ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా అందుబాటులో ఉన్నాయి. అలాగే పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల సరిహద్దుల్లో ఉన్న కర్ణాటక రాష్ట్రం చేలూ రు, చింతామణి, గౌనిపల్లె తదితర ప్రాంతాల ప్రజలు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు మండలాల ప్రజలు తిరుపతి, గుంతకల్లు వైపు ఉన్న ఊర్ల కు వెళ్లేందుకు ములకలచెరువుకు వస్తుంటారు. ముఖ్యంగా తిరుమలకు వె ళ్లే భక్తులకు ఈ రైళ్ళు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. బస్సు చార్జీలతో పోలిస్తే రైళ్ల చార్జీలు చాలా తక్కువగా ఉన్నాయి. నాలుగు రైళ్లు ఒకేసారి రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు తప్పవని, రైల్వే ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రైళ్లలో వెళ్లేందుకు వేచి ఉన్న ప్రయాణికులు

ఎంపీడీవోపై వైసీపీ నేతల దాడి

● గొంతుపై కాలేసి.. పిడిగుద్దులతో గుద్ది హత్యాయత్నం ● గది తాళాలు ఇవ్వలేదని వైసీపీ మాజీ ఎంపీపీ దాడి ● హత్యాయత్నం చేశారని ఎంపీడీవో ఫిర్యాదు
● మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలింపు ● నేడు రిమ్స్‌లో ఎంపీడీవోను పరామర్శించనున్న డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ● మంత్రి, కలెక్టర్ ఫోన్లో పరామర్శ



రాయచోటి ప్రభుత్వాసుపత్రికి వెళ్తున్న ఎంపీడీవో

రాయచోటి/గాలివీడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధికారం పోయినా వైసీపీ నాయకులకు దళితులపైన కోపం పోయినట్లు లేదు. చిన్న అవకాశం దొరికినా.. వాళ్ల మీద తమ ప్రతాపం చూపుతూనే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో దళితులపై దాడులు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అదే ఒరవడిని కొనసాగిస్తూ సాక్షాత్తు మండల పరిషత్ అభివృద్ధి అధికారిపైనే దాడి చేశారు. దౌర్జన్యంగా ఆయన ఛాంబర్‌లోకి ప్రవేశించి కింద పడేసి గొంతు మీద కాలేసి తొక్కి... పిడిగుద్దులు గుద్దారు. మేము అడిగితే గది తాళాలు ఇవ్వవా.. అంటూ కులం పేరుతో దుర్భాషలాడారు. మేము అధికారంలో లేకపోయినా మేము చెప్పినట్లు వినకపోతే ఏ అధికారికైనా ఇదే గతి... అనే రీతిలో చెలరేగిపోయారు. వైసీపీ నాయకుల అరాచకానికి అద్దం పట్టే ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. గాలివీడు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా దళితుడైన జవహర్‌బాబు పనిచేస్తున్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విధుల్లో ఉన్నారు. మధ్యాహ్నం వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డికి ముఖ్య అనుచరుడు, గాలివీడు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ కార్యాలయానికి వస్తున్నాడని, అతడి అనుచరులు గది తాళాలు అడిగారు. అటెండర్ వద్ద ఉన్నాయని, కాసేపటి తర్వాత ఇస్తానని ఎంపీడీవో చెప్పారు. ఇంతలో సుదర్శన్‌రెడ్డి అక్కడికి వచ్చారు. దీంతో అతడి అనుచరులు మళ్లీ గది తాళాలు అడిగారు. వైసీపీ నాయకులకు ఇవ్వనని, ఎంపీపీ అయిన సుదర్శన్‌రెడ్డి తల్లి వస్తేనే ఇస్తానని ఎంపీడీవో వారికి చెప్పారు. ఈ విషయాన్ని అతడికి అనుచరులు చెప్పడంతో ఆగ్రహించిన సుదర్శన్‌రెడ్డి తన అనుచరులతో కలిసి ఎంపీడీవో గదిలోకి వచ్చి గది తలుపులు మూసేసి దాడికి పాల్పడ్డాడు. కుర్చీలో ఉన్న జవహర్‌బాబును కింద పడేసి గొంతు మీద కాలేసి తొక్కారు. గుండెలపైన పిడిగుద్దులు గుద్దారు. గది బయట ఉన్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, కొందరు టీడీపీ నాయకులు గది తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. వారిపై కూడా వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. అనంతరం వారు ఎంపీడీవోను రక్షించారు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సుమారు అరగంట పాటు వైసీపీ నాయకులు వీరంగం సృష్టించారు. సిబ్బందిని నానా బూతులు తిట్టారు. కులం పేరుతో దూషించారు. ఇప్పటికే ఎంపీడీవో గుండె సమస్యతో ఇబ్బందిపడుతూ స్టంట్ వేసుకుని ఉన్నాడు. ఈ నేపథ్యంలో వైసీపీ నాయకులు దాడి చేయడంతో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అతడిని పరీక్షించి ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం 108లో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన గురించి తెలుసుకున్న వైసీపీ, టీడీపీ వర్గీయులు పెద్ద సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. పరస్పరం దాడులకు దిగుతారనే ఉద్రిక్త పరిస్థితుల్లో లక్కిరెడ్డిపల్లె సీఐ కొండారెడ్డి, గాలివీడు ఎస్‌ఐ రామకృష్ణ ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి అక్కడ గుమికూడిన వారిని చెదరగొట్టారు. సుదర్శన్‌రెడ్డితో పాటు మరికొందరిని సీఐ అదుపులోకి తీసుకుని తన వాహనంలో తీసుకెళ్లారు. దీంతో గొడవ సద్దుమణిగింది. గొడవ విషయం తెలుసుకున్న టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఎంపీడీవోతో మాట్లాడి ధైర్యం చెప్పారు.

నేడు కడపకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

వైసీపీ నేతల దాడిలో గాయపడి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎంపీడీవో జవహర్‌బాబును పరామర్శించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శనివారం కడపకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఎంపీడీవోపై వైసీపీ నాయకులు దాడి చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు.

14 మందిపై హత్యాయత్నం కేసు

ఈ సంఘటనలో ఎంపీడీవో ఫిర్యాదు మేరకు పోలీసులు సుదర్శన్‌రెడ్డితో పాటు మరో 13 మందిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ఇంకా కొందరు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించడం, గదిలోకి ప్రవేశించి దాడికి పాల్పడడం, హత్య చేసేందుకు యత్నించడం, కులం పేరుతో దూషించడం వంటి ఆరోపణలపై కేసు నమోదు చేశారు.

పలువురి పరామర్శ

వైసీపీ నాయకుల దాడిలో గాయపడిన ఎంపీడీవో జవహర్‌బాబును పలువురు పరామర్శించారు. రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి జవహర్‌బాబుకు ఫోన్ చేసి మాట్లాడారు. ఎంపీడీవోపై దాడి హేయమైన చర్య అన్నారు. గతంలో అధికారులపై దాడులు చేయడం వల్లే ప్రజలు వైసీపీ బుద్ధి చెప్పారని అన్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బి.సి.జనార్ధన్‌రెడ్డి కూడా ఈ దాడిని ఖండించి జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడం వైసీపీ రౌడీ సంస్కృతికి నిదర్శనమన్నారు. కలెక్టర్ శ్రీధర్ ఫోన్లో జవహర్‌బాబును పరామర్శించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలోని దాదాపు అందరు ఎంపీడీవోలు ఆసుపత్రి వద్దకు వచ్చి ఆయనను పరామర్శించారు. రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం పరామర్శించి సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవోతో పాటు పలువురు అధికారులు ఆయనను పరామర్శించారు. దళిత సంఘాలు, హక్కుల సంఘాలు కూడా ఎంపీడీవోపై దాడిని తీవ్రంగా ఖండించాయి. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

టీడీపీ కార్యకర్తలపైనా దాడి

ఎంపీడీవోపై వైసీపీ నాయకులు దాడి చేస్తున్న విషయాన్ని గమనించిన అక్కడే ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు టీడీపీ నాయకులు శ్రీకాంత్, నాయుడు, అంజి కార్యాలయంలోకి వెళ్లి అడ్డుకున్నారు. వారిపై కూడా వైసీపీ నాయకులు దాడి చేసినట్లు వారు తెలిపారు. తాము, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది అడ్డుకోకపోయి ఉంటే ఎంపీడీవోను హత్య చేసేవారని తెలిపారు. వైసీపీ అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో టీడీపీ నాయకులపై ఎన్నోసార్లు దాడులు చేశారని, ప్రస్తుతం కూడా వారి సంస్కృతి ఇలాగే కొనసాగుతున్నదని తెలిపారు. వైసీపీ శ్రేణులను వెంటబెట్టుకుని అరుస్తూ దాడులు చేశారన్నారు. ఎంపీడీవోపైన, తమపైన దాడి చేసిన వారిని పట్టుకుని కఠినశిక్ష పడేలా చూడాలని వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



టీడీపీ శ్రేణులపై దాడికి యత్నిస్తున్న వైసీపీ శ్రేణులు



వైసీపీ నాయకులను బయటకు పంపుతున్న పోలీసులు

పారదర్శకంగా 'స్వమిత్వ' సర్వే

● డీపీవో బాలకృష్ణారెడ్డి

పీలేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వమిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ ఆబాదీ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రువైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియా) సర్వేను పారదర్శకంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) బాలకృష్ణారెడ్డి పీలేరు మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పీలేరు మండలం గూడరేవుపల్లె, జాండ్ల గ్రామ పంచాయతీల్లోని చీరప్పరెడ్డిగారిపల్లె, మూరేవాండ్లపల్లెల్లో జరుగుతున్న స్వమిత్వ సర్వే, శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వమిత్వ సర్వే ద్వారా గ్రామీణులకు వారి భూములపై ప్రాపర్టీ కార్డులు రూపొందిస్తామన్నారు. అందువల్ల గ్రామాల్లో ఎటువంటి వివాదాలు చెలరేగకుండా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సర్వే చేయాలన్నారు. గ్రామ కంఠం భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలు సేకరించి ఆన్‌లైన్ చేసి వాటిని అప్‌లోడ్ చేయాలన్నారు. ఆయా ఇళ్లకు సంబంధించిన డాక్యుమెంట్లను యజమానులు ఆన్‌లైన్‌లో తీసుకునే వెసలుబాటు కలుగుతుందన్నారు. ఇంటి విలువ ఆధారంగా బ్యాంకుల్లో రుణాలు పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది స్వమిత్వ సర్వేను నిర్లక్ష్యం చేయరాదన్నారు. అనంతరం ఆయన ప్రభుత్వం తరపు నుంచి అందుతున్న సౌకర్యాల గురించి గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌ఆర్‌డీ లతీఫ్ ఖాన్, జాండ్ల సర్పంచ్ నీలిమ, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చీరప్పరెడ్డిగారిపల్లెలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీవో బాలకృష్ణా రెడ్డి

విద్యుత్ చార్జీల పెంపుపై వైసీపీ ఆందోళన

● జనం స్పందన కరువు

రాయచోటి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కరెంటు రేట్లు పెంచిందని, వాటిని తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు జరిగాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీల పెంపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రం రాయచోటిలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన కార్యాలయం నుంచి ఏపీఎస్‌పీడీసీఎల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కరెంటు చార్జీలు తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పీలేరులో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఈఈకి వినతిపత్రం అందించారు. విద్యుత్ శాఖ కార్యాలయానికి 100 మీటర్ల దూరం నుంచి ర్యాలీ నిర్వహించారు.

మదనపల్లెలో మాజీ ఎమ్మెల్సీ నరేశ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాజంపేటలో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిల ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయం నుంచి విద్యుత్ డివిజనల్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అయితే జిల్లా వ్యాప్తంగా వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనా కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కనిపించలేదు. వైసీపీ నాయకులు, కార్యకర్తలే పాల్గొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే అదానీ కంపెనీతో ఒప్పందాలు చేసుకుని గత ఐదేళ్లలో ఇష్టారీతిన 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి తీరా ఇప్పుడు ఆ చార్జీలు తగ్గించాలని ఆందోళన చేయడం హాస్యాస్పదమని పలువురు వ్యాఖ్యానించారు.



రాయచోటిలో ర్యాలీ చేస్తున్న వైసీపీ నాయకులు

ఎప్పటికి పూర్తయ్యేనో..?!

● నిర్మాణంపై చేతులెత్తేసిన కాంట్రాక్టర్
● మందుబాబుల అడ్డాగా అసంపూర్తి భవనం
● నిరుపయోగంగా అధునాతన సామగ్రి
● కూటమి ప్రభుత్వమైనా పూర్తి చేయాలంటున్న రైతులు

పీలేరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి పీలేరులో అసంపూర్తిగా మిగిలిపోయిన డాక్టర్ వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవనం సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం, ఉదాసీన వైఖరి వల్ల వ్యవసాయ రంగంలో నాణ్యత పెంపునకు దోహదపడాల్సిన అగ్రి ల్యాబ్ తన ఆశయానికి ఆమడ దూరంలో నిలిచిపోయింది. ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయి ఏళ్లు గడిచి నా, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, అప్పటి జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు సందర్శించి త్వరలోనే పూర్తి చేస్తామని ప్రకటనలు చేసినా అవేవీ ఆచరణకు నోచుకో లేదు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడం, మిగిలిన పనులు పూర్తి చేసినా బిల్లులు వస్తాయన్న నమ్మకం లేకపోవడంతో ఆ భవన నిర్మాణాన్ని ప్రారంభించిన కాంట్రాక్టరు చేతులెత్తేశారు. దీంతో అసంపూర్తిగా మిగిలిపోయిన ఆ భవనం మందుబాబులకు అడ్డాగా మారి పోయింది. కూటమి ప్రభుత్వంలోనైనా అగ్రి ల్యాబ్ నిర్మాణం పూర్తయి, అందులో పనులు ప్రారంభం కావాలని అటు అధికారులు, ఇటు రైతులు ఆశిస్తున్నారు. జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి, రాజంపేట, రైల్వేకో డూరు నియోజకవర్గాల్లోని అగ్రిల్యాబ్‌లు ప్రస్తు తం రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుండగా పీలేరులో మాత్రం అసంపూర్తిగా మిగిలి ఉంది.

నాణ్యత పెంపు కోసం అగ్రి ల్యాబ్'

వ్యవసాయ రంగంలో నాణ్యతను పెంచేందుకు జగన్ ప్రభుత్వం 2019లో డాక్టర్ వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ పేరిట నూతన విధా నాన్ని ప్రవేశపెట్టింది. విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులను ఈ ల్యాబ్‌లలో పరీక్షిం చిన అనంతరం రైతులకు అందించాలని, తద్వారా రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు అందాలన్నది ప్రభుత్వ ధ్యేయం. ప్రభుత్వం అందించే ఉత్పత్తులే కాకుండా మార్కెట్‌లో లభ్యమయ్యే వ్యవసాయ ఉత్పత్తులను కూడా రైతులు, వ్యాపారులు ఈ ల్యాబ్‌లలో నామమా త్రపు రుసుం చెల్లించి నాణ్యతా పరీక్షలు చేయించుకోవచ్చు. అందులో భాగంగా ప్రతి ని యోజకవర్గానికి ఒక అగ్రిల్యాబ్‌ను మంజూరు చేసింది. ఒక్కో ల్యాబ్ భవన నిర్మాణానికి రూ. 54 లక్షలు మంజూరు చేసి వాటి నిర్మాణ పను లు పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పోలీసు హౌ సింగ్ కార్పొరేషన్‌కు అప్పగించింది ప్రభుత్వం. అలా పీలేరు నియోజకవర్గానికి చెందిన ల్యాబ్ భవన నిర్మాణ పనులను పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో 2020లో ప్రా రంభించారు. ఏడాది కాలపరిమితితో భవనాన్ని పూర్తి చేయాలని అధికారులు సంకల్పించారు. అయితే కరోనా కారణంగా ఆ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి.

కరోనా.. కరెంటు.. కాంట్రాక్టరు

కరోనా కారణంగా నిలిచిపోయిన అగ్రి ల్యాబ్ నిర్మాణ పనులు కరోనా ఉధృతి తగ్గుముఖం పట్టిన తరువాత కాస్త ఊపందుకున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టరు భవన నిర్మాణ పనులను మోల్డింగ్ వరకు పూర్తి చేయగా మిగిలిన పనులకు విద్యుత్ సౌకర్యం కావాల్సి రావడంతో పనులు మళ్లీ ఆగిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న పీలేరు వ్యవసాయ శాఖాధికారులు తమ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి అగ్రి ల్యాబ్‌కు అవసరమైన 16 కేవీల విద్యుత్ కనెక్షన్ కోసం రూ.2.30 లక్షలు చెల్లించడంతో ట్రాన్స్‌ఫార్మర్ బిగించి విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఇక పనులు పూర్తయినట్టేనని భావించిన తరుణంలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల కారణంగా కాంట్రాక్టరు మళ్లీ పనులు నిలిపివేశారు. 2023 ఆగస్టులో ఆ భవనాన్ని సందర్శించిన జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రానాయక్ కాంట్రాక్టరు విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పనులు పునఃప్రారంభం అయ్యేలా చూస్తామన్నారు. అయినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. అగ్రి ల్యాబ్‌లో అమర్చాల్సిన పరికరాలన్నీ ప్రస్తుతం పీలేరు ఏడీ కార్యాలయంలో ఉన్నాయి. సరైన సమయంలో ఉపయోగించుకోలేకపోతే అవి ఎక్కడ నిరర్థకమైపోతాయోనని వ్యవసాయ అధికారులు ఆందోళన చెందుతున్నారు.



పీలేరులో అసంపూర్తిగా మిగిలిపోయిన అగ్రిల్యాబ్ భవనం

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

పెండింగ్‌లో ఉన్న ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్ అంశాన్ని ఇప్పటికే పలుమార్లు మా శాఖ ఉన్నతాధికారులతో పాటు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. పనులు పర్యవేక్షిస్తున్న పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడాము. అవసరమైతే కాంట్రాక్టరును మార్చి పనులు పూర్తి చేస్తామని వారు గతంలో హామీ ఇచ్చి ఉన్నారు. వారి నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం.

- రమణరావు, ఏడీ, వ్యవసాయశాఖ

మందుబాబుల అడ్డాగా ల్యాబ్ భవనం

పీలేరు మార్కెట్ కమిటీ ఆవరణలోని సగం కట్టిన అగ్రి ల్యాబ్ భవనం మందు బాబులకు, పోగరాయుళ్లకు అడ్డాగా మారింది. పగటి వేళ పోగరాయుళ్లు, రాత్రిళ్లు మందు బాబులు దానిని యథేచ్ఛగా వాడుకుంటున్నారు. భవనం నిండా సిగరెట్ పీకలు, ఖాళీ మందుసీసాలు దర్శనమిస్తున్నాయి.



రాయచోటిలోని ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవనం



రాయచోటిలోని ల్యాబ్‌లో ఉన్న పరికరాలు



ఫుడ్ టెక్నాలజీలో
నూతన ఒరవడి
● రూ.20 లక్షలతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్
● ఆధునిక యంత్రాలతో విద్యార్థులకు బోధన, వ్యాపారం
● ప్రజలూ వినియోగించుకునేందుకు అవకాశం
6

అప్పనంగా లక్షలు అప్పజెప్పారు..
● పనులు చేయకున్నా బిల్లులు
● అభివృద్ధి నిధులు పెద్దల పాలు
● ఫిర్యాదులతో గట్టు రట్టు
6

కాల్పుల ఘటనలో నిందితుడు అరెస్ట్
● వివరాలు వెల్లడించిన రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్

ఫుడ్ టెక్నాలజీలో..
నూతన ఒరవడి


కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు

- **రూ.20లక్షలతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్**
- **ఆధునిక యంత్రాలతో విద్యార్థులకు బోధన, వ్యాపారం**
- **ప్రజలూ వినియోగించుకునేందుకు అవకాశం**

పులివెందుల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజ్‌లో అటు ప్రజలు, ఇటు విద్యార్థుల కోసం చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైంది. ఆధునిక యంత్రాలతో కళాశాల యాజమాన్యం దీనిని అందరికీ అందుబాటులోకి తెచ్చింది. చిరుధాన్యాలు (మిల్లెట్స్) శుద్ధి చేయడం, వారికి కావాల్సిన విధంగా పిండి, రవ్వ రూపంలో తయారుచేయడం దీని ప్రత్యేకత. ఒకేచోట ఆరు యంత్రాలతో మిల్లెట్ ప్రాసెసింగ్ చేయడం జిల్లాలోనే మొట్టమొదటి యూనిట్‌గా చెప్పవచ్చు.

గతంలో చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేయాలంటే చాలా శ్రమతో కూడిన పని. ఇళ్లలో అమ్మమ్మ, నాయనమ్మ చిరుధాన్యాలను రోట్లో వేసి దంచి వాటిని చాటల సాయంతో శుద్ధి చేసేవారు. అనంతరం వాటిని విసుర్రాయి సాయంతో పిండిగాని, రవ్వగాని తయారుచేసేవారు. చిరుధాన్యాల ప్రాసెస్ పెద్ద శ్రమతో కూడుకున్న పని కావడం, ప్రజలు బియ్యానికి అలవాటు పడ్డంతో వీటి వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఇప్పుడంతా రెడీ ఫర్ కుక్ (వంటచేసుకునేందుకు సిద్ధం) అన్నట్టుగా బియ్యం పిండి, గోధుమపిండి, జొన్నపిండి, రాగిపిండి తదితర వాటిని వినియోగిస్తున్నారు. రానురాను మన పూర్వీకుల ఆహారపు అలవాట్లు మంచిగా ఉండేవని, మళ్లీ అటువైపే ప్రజలు మళ్లుతున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది చిరుధాన్యాల వాడకం వైపు వస్తున్నారు. అయినా చిరుధాన్యాల ప్రాసెస్ ఇప్పటి మహిళలకు పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో పులివెందులలో ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజ్‌లో నూతన ఒరవడికి నాంది పలికారు. ఇక్కడ ఆధునిక యంత్రాలతో చిరుధాన్యాల ప్రాసెస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు.


రాగులను శుద్ధి చేయక ముందు..చేసిన తర్వాత


రాగులను ఎలా శుద్ధి చేయాలో విద్యార్థులకు వివరిస్తున్న డీన్, అధ్యాపకులు

అందరికీ అందుబాటులో..

మన చుట్టుపక్కల ప్రాంతాల్లో కొర్రలు, జొన్నలు, రాగులు, సద్దలు తదితర చిరుధాన్యాలను రైతులు పండిస్తున్నారు. వీటిని రైతుల వద్ద కొని పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజ్‌లో ఏర్పాటుచేసిన ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలిస్తే చాలు. అక్కడ కళాశాల విద్యార్థులు, సిబ్బంది మార్కెట్‌లో దొరుకుతున్న చిరుధాన్యాల కంటే శుద్ధిగా మనకు కావాల్సిన విధంగా తయారుచేసి ఇస్తారు. ఉదాహరణకు ఒకరైతు వద్ద రాగులు పది కిలోలు కొని ఈ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకెళ్తే అక్కడ మొదట ఒక యంత్రం ద్వారా రాగుల్లో ఉన్న చెత్తాచెదారం, రాళ్లు, మట్టి, ఇసుక తదితర వాటిని పూర్తిగా శుద్ధిచేస్తుంది. అలా శుద్ధి అయిన రాగులను మరో యంత్రంలో వేస్తే అందులో రాగులకు ఉన్న పొట్టును 90శాతం తొలగిస్తుంది. పక్కనున్న మరో యంత్రలో రాగులను వేస్తే వీటిలో ఇతర చిరుధాన్యాలు ఏవైనా కలిసి ఉంటే వాటిని వేరుచేస్తుంది. అనంతరం పూర్తిస్థాయిలో పిండికావాలి ఉంటే మరో యంత్రంలో వేయాలి. అదే జొన్నలు గాని, గోధుమలు గాని రవ్వ చేసేందుకు మరో యంత్రం అక్కడే ఉంది. ఈ ప్రాసెసింగ్ అంతా కేవలం నిమిషాల వ్యవధిలోనే జరిగిపోతుంది. ఆంధ్రజ్యోతి అక్కడకు వెళ్లిన సమయంలో పది కిలోల తూకం చూసి ప్రాసెసింగ్ చేశారు. ప్రాసెసింగ్ చేసిన అనంతరం 450 గ్రాములు శుద్ధిరూపంలో బయటకు పోయింది. మిగిలిన 9.550 కిలోలు మళ్లీ తూకం వేసి చూపించారు. ఈ ప్రాసెసింగ్ చేయడానికి కిలోకు రూ.5 వసూలు చేస్తామని కళాశాల డీన్ మాధవ పేర్కొన్నారు.

విద్యార్థులకు బోధన, వ్యాపారం

ఒకప్పుడు చిరుధాన్యాలు బాగా ఉపయోగించినా అనంతరం వీటి వాడకం క్రమంగా తగ్గిపోయింది. ఇటీవల ప్రజలు చాలా మంది ఏదో ఒక అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో మళ్లీ మన పూర్వీకుల ఆహారపు అలవాట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో చిరుధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. కానీ చిరుధాన్యాల ప్రాసెసింగ్ చాలా శ్రమతో కూడుకున్నది. దీన్ని గుర్తించి పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల దాదాపు రూ.20లక్షలతో ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసి చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది.

దీని ద్వారా చిరుధాన్యాలను ప్రాసెసింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు టెక్నికల్‌గా బోధించే అవకాశం కలుగుతోంది. అలాగే ప్రాసెస్ చేయడం ద్వారా కళాశాలకూ కొంత ఆదాయం సమకూరుతోంది. అలాగే రైతుల వద్ద కొని తెచ్చిన వివిధ రకాల చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేసి ప్యాకెట్ల రూపంలో వాటిని మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. విద్యార్థులు చిరుధాన్యాలను ప్రాసెస్ చేయడమే కాకుండా వాటిని మార్కెటింగ్ చేయడం కూడా ఈ బోధనలో ఒక అంశం. కిలో చిరుధాన్యం ప్రాసెసింగ్ చేస్తే రూ.5 వసూలు చేస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. తమ కళాశాలలోని చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది.

గొర్రెల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

రైల్వేకోడూరుకు చెందిన ఒకరు మృతి, 8 మందికి తీవ్రగాయాలు



కందల సోమయ్య మృతదేహం, వ్యాన్‌లో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు/గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరు రూరల్ సర్కిల్ పరిధి లోని గోగినేనిపురం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వేకోడూరుకు చెందిన ఒకరు మృతి చెందగా 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు నుంచి గూడూరు సంతకు గొర్రెలను మినీ వ్యాన్‌లో తరలిస్తుండగా గూడూరు గోగినేనిపురం సమీపంలో లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లె పంచాయతీ పిట్లావాండ్లపల్లెకు చెందిన కందల సోమయ్య (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేకోడూరు పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన రమణయ్య, చిట్వేలి మండలంలోని చిన్నరాసపల్లెకు చెందిన కట్టా ఈశ్వరయ్య, రైల్వేకోడూరు పట్టణంలోని దర్బాపురానికి చెందిన తుంగా భాస్కర్, చిట్వేలి మండలంలోని నాగవరానికి చెందిన దాడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఓబులవారిపల్లె మండలం దళితవాడకు చెందిన సిబ్యాల చినవెంకటయ్య, రైల్వేకోడూరు పట్టణం ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన నార్జాల రమణయ్య, రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లెకు చెందిన ఆరిబోయిన పెంచలయ్య, రైల్వేకోడూరుకు చెందిన నార్జాల సూర్యప్రకాష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో మినీ వ్యాన్ దెబ్బతింది. వ్యాన్‌లో కొందరు ఇరుక్కుపోవడంతో పోలీసులు, స్థానికులు కలసి సహాయక చర్యలు చేపట్టి వెలికితీశారు. మృతిచెందిన వ్యక్తి, ప్రయాణించే వ్యక్తులు అందరూ గొర్రెల వ్యాపారులని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వ్యాన్ టాప్‌లో ఉన్నాడని, లారీ ఢీకొట్టడంతో ఒక్కసారిగా సోమయ్య కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గొర్రెలను ఇతర వాహనంలో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు మనోజ్‌కుమార్ తెలిపారు.

కాల్పుల ఘటనలో నిందితుడు అరెస్ట్

- **నాటు తుపాకీ మందుగుండు సామగ్రి స్వాధీనం**
- **వివరాలు వెల్లడించిన రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్**


వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట, మాధవరం గ్రామాలకు సరిహద్దు ప్రాంతంలో గల దేవరగుట్ట సమీపంలో ఈనెల 22వ తేదీ జరిగిన నాటుతుపాకీ కాల్పుల ఘటనలో నిందితుడు ముడి రమణప్పనాయుడును శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం గురికానివాండ్లపల్లెకు చెందిన ముడి నాగప్పనాయుడు కుమారుడు రమణప్పనాయుడు తన తండ్రి కాలం నుంచి 40 సంవత్సరాలుగా ఒక నాటు తుపాకీని ఉపయోగిస్తూ అడవి జంతువులను వేటాడుతూ ఉండేవారన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 21వ తేదీ శనివారం రాత్రి తన ఇంట్లో ఉన్న నాటు తుపాకీని తీసుకొని కాటిమాయకుంట గ్రామానికి పడమర వైపు గల దేవరగుట్ట సమీపానికి పోయి అడవి పందుల కోసం మాటు వేసి ఉన్నాడు. సంబేపల్లె మండల కేంద్రంలోని నామాలగుట్టకు చెందిన పూసల కులానికి చెందిన నీలకంఠం హనుమంతు, అతడి బంధువు రమణ కూడా అదేరోజు సాయంత్రం అడవి జంతువుల కోసం దేవరగుట్ట ప్రాంతంలో వలలు వేసి ఇళ్లకు వచ్చారు.

తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హనుమంతు, రమణ వలలు వేసిన ప్రాంతానికి పోయి అక్కడ వలలో ఏవైనా అడవి జంతువులు పడ్డాయా అని వెతకుతుండగా అక్కడే పందుల కోసం ముందుగానే నాటుతుపాకీతో మాటు వేసి ఉన్న రమణప్పనాయుడు, హనుమతు, రమణల అలికిడి విని అడవి పందులు అనుకుని తన వద్ద ఉన్న తుపాకీతో కాల్చాడు. దీంతో తుపాకీ గుండ్లు వెళ్లి హనుమంతు, రమణలకు తగలడంతో వారు గట్టిగా అరిచి వలలను అక్కడే వదిలి రక్తగాయాలతో తమ ఇళ్ల వద్దకు వెళ్లగా వారి బంధువులు గాయాలతో ఉన్న వారిని చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వారిద్దరినీ కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హనుమంతు మృతి చెందగా రమణ కోలుకుంటున్నాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిందితుడు ముడి రమణప్పనాయుడు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి నాటు తుపాకీ దానిలో వాడే మూడు రకాల గుండ్లు, నల్ల మందును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. కాల్పుల ఘటన కేసులో వేగవంతంగా క్లూస్ కనిపెట్టడంతో పాటు ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, శ్రీనివాస్‌నాయక్‌తో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

సుదర్శన్‌రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి


రాయచోటి ఏరియా ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన గాలివీడు మాజీ ఎంపీపీ, వైసీపీ నాయకుడు జల్లా సుదర్శన్‌రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేసి హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని జిల్లా ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డెయ్య, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, పౌరహక్కుల నాయకుడు వంగిమళ్ల రమణ, వడ్డెర విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్, ఉపాధ్యాయ సంఘాలు, ఎన్జీవో నాయకులు, కార్మిక సంఘాల నాయకులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డి తల్లి ఎంపీపీ అయినప్పటికీ.. ఆయన ఆఫీసులో పెత్తనం చెలాయిస్తూ తాను చెప్పినట్లు అధికారులు వినాలనడం సరికాదని ఆరోపించారు. సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ సభాభవనంలో ఉండేందుకు ఏ విధమైన అర్హత లేదని, అలాంటి వ్యక్తి దాడి చేయడం అన్యాయమన్నారు. ఈయనకు న్యాయవాది లక్షణాలు ఏమీ లేవని, రౌడీలాగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తులకు సమాజంలో ఉండే అర్హత లేదని, శాశ్వతంగా జైల్లో ఉండాలని వారు డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులో బాహాబాహి


ఇరువర్గాల వారు ఘర్షణ పడుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెండు వర్గాలకు చెందిన టీడీపీ నాయకులు బాహాబాహికి దిగారు. వివరాలిలా.. స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముందుగా రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఇతర మండలాలకు చెందిన వ్యక్తులతో సమావేశానికి హాజరయ్యారు. అదే సమయానికి సీనియర్ టీడీపీ నాయకుడు, కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఉన్న తమకు కాకుండా ఇతర మండలాలకు చెందిన వ్యక్తులను ఎలా వేదికపై కూర్చొబెడతారని తహసీల్దారును నిలదీశారు. స్థానికంగా ఉన్న వారికి సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఒంటిమిట్టకు చెందిన టీడీపీ నాయకులు సమావేశానికి హాజరుకాగానే సమావేశం నుంచి సుగవాసి సుబ్రమణ్యం తన వర్గీయులతో వెనుదిరిగారు. అనంతరం మాజీ మండలాధ్యక్షుడు పాములూరు సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇది రాజకీయ సమావేశమా? ప్రజల కోసం ఏర్పాటు చేసిన సమావేశమా? అని ప్రశ్నించడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఒంటిమిట్టలో ఉన్న స్థానిక టీడీపీ నాయకులకు సమాచారం ఇవ్వకుండా వేదిక మీద లేకుండా ఇతర మండలాలకు సంబంధించిన వ్యక్తులను, ఇతర పంచాయతీ వ్యక్తులను కూర్చొబెట్టడంలో ఆంతర్యమేమిటని తహసీల్దారును గట్టిగా నిలదీయడంతో అరుపులు, కేకలతో సమావేశం దద్దరిల్లింది. ఇదిలా ఉండగా అక్కడే ఉన్న స్థానిక సీపీఎం నాయకుడు యానాదయ్య తహసీల్దారుకు మద్దతు పలకడంతో మరింత వివాదం చోటు చేసుకుంది. తమ పార్టీకి సంబంధించిన విషయంలో సీపీఎం పార్టీకి సంబంధించిన వ్యక్తికి ఏం పని అని టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో ఇరువర్గాల వారు స్టేజీ వద్ద అరుపులు, కేకలతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలకు సర్దిజెప్పి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వారి సలహాల మేరకు సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పడంతో సదస్సును నిర్వహించారు.

అప్పనంగా లక్షలు అప్పజెప్పారు...

- **పనులు చేయకున్నా బిల్లులు**
- **అభివృద్ధి నిధులు పెద్దల పాలు**
- **ఫిర్యాదులతో గట్టు రట్టు**


పనులు చేయకుండానే బిల్లులు చేసినట్లు ఆరోపణలు వస్తున్న అప్పయ్యగారిపల్లె రోడ్డు

సుండుపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలన ఆ పార్టీ నేతలకు ఆదాయ వనరుగా మారింది. అధికారమే పెట్టుబడిగా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అధికారులు కూడా వైసీపీ నేతల మాటలకు తలవంచి పనులు చేయకుండానే సుండుపల్లె మండలంలో లక్షలాది రూపాయల బిల్లులు చేసినట్లు విచారణలో బట్టబయలవుతోంది. మండల అభివృద్ధి నిధుల నుంచి పంచాయతీ నిధులు రైతులకు ఉచితంగా పంపిణీ చేసే వ్యవసాయ పనిముట్లు, సంక్షేమ పథకాలకు కూడా గండికొట్టారు.

అధికార పార్టీలో కీలకంగా వ్యవహరించిన, ప్రజాప్రతినిధుల అనుచరులు చెప్పినట్లు చెయ్యక తప్పలేదని తప్పులు చేశామని కొంతమంది అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల అభివృద్ధి నిధులు, గ్రామ పంచాయతీల అభివృద్ధి నిధులు పక్కదారి పట్టాయని సుమారు రూ.70 లక్షల వరకు దొంగ బిల్లులు పెట్టి ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు, అధికారులు పంచుకున్నారని విచారణ చేపట్టాలని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ చేస్తున్నారు. విచారణను సైతం ప్రస్తుతం అధికార పార్టీలో పలుకుబడి ఉన్న వ్యక్తుల సహాయంతో పక్కదారి పట్టించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని విమర్శలు ఉన్నాయి.

రోడ్డు వేయకుండానే...

వైసీపీ పాలనలో అభివృద్ధికి తూట్లు పొడుస్తూ మండల అభివృద్ధికి, గ్రామ పంచాయతీల అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి వచ్చిన నిధులను అసలు పనులే చేయకుండా బిల్లులు పెట్టుకునే సంప్రదాయానికి తెరలేపారు. సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలో అప్పయ్యగారిపల్లెలో సీసీ రోడ్డు వేసినట్లు రూ.1,77,975 బిల్లు చేశారని ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల ఫిర్యాదుతో జిల్లా ఉన్నతాధికారుల విచారణతో ఈ విషయం వెలుగు చూసింది. అధికారికంగా అధికారులు సంతకాలు పెట్టి ప్రభుత్వ ముద్రలతో ఎం-బుక్కులు రెడీ చేసి చెయ్యని పనికి నిధులు డ్రా చేయడంతో గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మీ అవినీతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని, కారణమైన వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. 2016 టీడీపీ హయాంలో చేసిన పనులకు 2022-23 సంవత్సరం వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు డ్రా చేసినట్లు మరికొంతమంది చెబుతున్నారు.

చెయ్యమన్నారు.. చేతులెత్తేశారు....:

మా ప్రభుత్వం ఎమ్మెల్యే, ఎంపీ మనవాళ్లే ఇబ్బంది లేదు నేను చూసుకుంటాను. బిల్లులు చేయండి.. ఇచ్చింది తీసుకోండి అని మాతో తప్పుడు పనులు చేయించారు. ప్రభుత్వం మారింది. మమ్మల్ని కాపాడండి మహాప్రభో అని కొంతమంది అధికారులు నేతలు, ప్రజాప్రతినిధుల దగ్గరికి పరుగులు తీస్తున్నారు. మాకేం సంబంధం మీ సంతకాలతో నిధులు డ్రా చేశారు. మీరే అనుభవించండి అని చెబుతున్నారని సమాచారం. లక్షలాది రూపాయలు అక్రమంగా పెట్టిన బిల్లులు తీసుకుని చేతులెత్తేశారని అధికారులు వాపోతున్నారు. తప్పు చేశాము. జీవితంలో ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చేయమని కొంతమంది మదనపడుతున్నారు. మండల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డిలు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలిందని స మాచారం. ఇప్పటికే విచారణలో రూ.5,03,160 లక్షలు రికవరీ చేశారు. రికవరీ డబ్బులు కూడా కొంతమంది అధికారులే చెల్లించినట్లు సమాచారం. కొంతమంది వైసీపీ నేతల మాటలు విని తప్పులు చేశాము. ఉద్యోగాలు కాపాడుకునేందుకు తప్పడం లేదని తమ జీతాల నుంచి వచ్చిన డబ్బును చెల్లించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిన్నగొల్లపల్లె పంచాయతీలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదులు అందాయి. విచారణ జరుగుతోంది. మరో ఐదు గ్రామ పంచాయతీల్లో పెద్ద మొత్తంలో పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.

విచారణ జరుగుతోంది

గత ప్రభుత్వంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని మండలానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేశారు. విచారణ జరుగుతోంది. కొంత డబ్బును ప్రభుత్వానికి తిరిగి చెల్లించాము. విచారణ పూర్తయితే పై అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

-సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె



సుండుపల్లె మండల అభివృద్ధి కార్యాలయం - మండల నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

‘మీసేవ’కు పూర్వ వైభవం వచ్చేనా...

- వైసీపీ ప్రభుత్వంలో మీసేవ కేంద్రాలకు గ్రహణం
- సచివాలయ వ్యవస్థతో నిర్వీర్యం
- ఆదాయం లేక నడపలేక, మూసివేయలేక అయోమయంలో నిర్వాహకులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్ర బాబు మీసేవ కేంద్రాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు వివిధ రకాల సేవలు అందించేలా వాటిని తీర్చిదిద్దారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మీసేవ కేంద్రాలు మూతబడ్డాయి. అప్పటి నుంచి ప్రభుత్వ ఆదరణ లేక ఏపీ ఆన్‌లైన్, మీసేవ కేంద్రాలు కొట్టుమి ట్టాడుతున్నాయి. కడప జిల్లాలో అర్బన్ సెంటర్లు కడప 5, ప్రొద్దు టూరు 3, జమ్మలమడుగు 1, పులివెందుల 1, రాయచోటి 1 ఉండేవి. అంతేకాకుండా ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు జిల్లాలో మొత్తం 320 కేంద్రా లు ఉండేవి. 40 అర్బన్ ఫ్రాంఛైజీలు సెంటర్లు ఉండేవి. 2011లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సీసీఎస్ భాగస్వామ్యంతో మీసేవ కేంద్రా లను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2014లో చంద్ర బాబు అధికారంలోకి వచ్చాక వీటి ప్రాధాన్యత పెరిగింది. పరిమి తంగా ఉన్న సేవలను 350 వరకు పెంచారు. దీంతో మీ సేవ కేంద్రాలు కీలకంగా మారాయి. ఆపరేటర్లకు చేతినిండా పని ఉండేది. వారి జీవనం సాఫీగా జరిగేది.

సచివాలయాల రాకతో...

2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు అయ్యాక మీ సేవ కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. ప్రభుత్వ సర్వీసులన్నీ సచివాలయంలోనే అప్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో ప్రతి ఒక్కరూ సచివాలయాల బాట పట్టారు. మీసేవ కేంద్రాలకు వెళ్లేవారు కరువయ్యారు. అంతేకాకుండా జిల్లాలో ఉన్న 11 అర్బన్ సేవా కేంద్రాలు పూర్తిస్థాయిలో మూతబడ్డాయి. గతంలో రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, వ్యవసాయ భూముల కొనుగోలులో మ్యుటేషన్ పత్రాలు మీసేవలో జారీ చేసేవారు. సచివాలయాల రాకతో అవన్నీ మాయం అయ్యాయి. ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు అర్బన్ ఫ్రాంఛైజీలు ఆదాయం లేకపోవడంతో కొందరు మూసివేశారు. మరికొందరు మూయలేక, నడపలేక అయోమయంలో ఉన్నారు.

అన్నివేళలా అందుబాటులో మీ సేవలు

మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ఉదయం నుంచి రాత్రివరకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాలు పనిచేస్తున్నాయి. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్లు, పన్నులు, బిల్లులు చెల్లింపులకు ఈ కేంద్రాలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవి. అనేక ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన మీసేవలకు వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చింది. సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలోనే మీసేవ కేంద్రాల్లో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవని అధికారులు కూడా సచివాలయాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం కూడా మీసేవ కేంద్రాలను పరిగణనలోకి తీసుకోరాదని హెచ్చరించడంతో అధికారులు కూడా మీసేవలను దూరం పెట్టారు. దీంతో మీసేవలకు ప్రజలు దూరమయ్యారు. ఈ క్రమంలో మీసేవ కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థిక ఇక్కట్లతో కొందరు కేంద్రాలు నడపలేక మూసి వేశారు.

రైతులకు 1బి అడంగల్ పత్రాలు, విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లు కావాల్సి వస్తే మీసేవ కేంద్రాలకు పరుగులు తీసేవారు. ఇక నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నా.. ఓటరు కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నా.. మీ సేవా కేంద్రాలే గుర్తుకు వచ్చేవి. అవన్నీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. సచివాలయాల వ్యవస్థను తీసుకురావడంతో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు ఆదరణ కోల్పోయాయి. దీంతో నిర్వాహకులు అటు కేంద్రాలు నడపలేక, మూయలేక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో మీ సేవకు పూర్వవైభవం వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.



పులివెందులలో ఓ మీసేవ కేంద్రం

సచివాలయాల్లో సేవలు ఉన్నా....

గ్రామ, వార్డు సచివాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకే అందుబాటులో ఉంటాయి. ఈ కారణంగా వివిధ పనులు ఉద్యోగాలకు వెళ్లే వారికి ఆశించిన విధంగా సచివాలయాల సేవలు ఉపయోగపడడం లేదనే విమర్శలున్నాయి. ఇక రెవెన్యూ, వ్యవసాయ పౌర సరఫరాలు, విద్యుత్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ వంటి సేవలు అందిస్తామన్న ఆయాశాఖల నుంచి అధికారులు మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తులు ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యారు.

అంతా... గందరగోళం..

ఇక సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్ ఇన్ కమ్ ఫ్యామిలీమెంబరు సర్టిఫికెట్లకు ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీసేవ కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. పీడీఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలు సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని.. సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీ సేవ కేంద్రాలు నిరాకరిస్తున్నాయి. సచివాలయాలు, మీసేవ కేంద్రాల మధ్య నెలకొన్న గందరగోళంలో అర్జీదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

గత ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో కడప జిల్లా మీసేవ ఆపరేటర్లు లోకేశ్‌ను కలిశారు. మీసేవలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వస్తే సచివా లయాల వ్యవస్థ రద్దు చేస్తారని ఊహాగానాలు వినిపించాయి. అదే జరిగితే మీ సేవ కేంద్రాలు పూర్వవైభవం సంతరించుకుంటాయని నిర్వాహ కులు భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో నిర్వాహకులు అప్పుడు ఇప్పుడు అంతేనంటూ పెదవి విరుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సీఎం చంద్ర బాబునాయుడు మీ సేవా కేంద్రాలకు పూర్వవైభవం తెస్తారని భావిస్తున్నారు.

రైతులకు శాశ్వత రస్తా సౌకర్యం కల్పించండి

- జువారి అధికారులకు ఆర్డీఓ ఆదేశం

ఎర్రగుంట్ల, డిసెంబరు 27: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి నుంచి ఎర్రగుడిపాడు రస్తాలో జువారి రైల్వేట్రాక్ వద్ద రైతులకు శాశ్వత రస్తా పరిష్కారం చూపాలని జమ్మలమడుగు ఆర్డీఓ తేజశ్రీ జువారి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఎర్రగుంట్ల బీజేపీ నేత కత్తి ప్రతాప్‌రెడ్డి మరికొందరు రైతులు రైల్వే ట్రాక్‌వద్ద రస్తా లేకపోవడంతో మూడు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు, ఆర్డీఓకు, జువారి అధికారులకు రిజిస్టర్ పోస్టుల ద్వారా ఫిర్యాదు చేశారు. ఎర్రగుడిపాడు రస్తా పూర్వం నుంచి ఉందని, జువారి రైల్వే ట్రాక్ వేసిన తర్వాత ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, రైతులు ట్రాక్‌పైనుంచి వెళ్లాలన్నా, దాటాలన్నా తీవ్ర ఇబ్బందులున్నాయి. ఇందుకు స్పందించిన ఆర్డీఓ రైతులకు ఎలాంటి ఇబ్బంది ల్లేకుండా వారికి సరైన శాశ్వత రస్తా సౌకర్యం కల్పించాలని ఆర్డీఓ జువారి యాజమాన్యాన్ని ఆదేశిస్తూ లేఖ రాశారు. వారి స్పందన చూసిన తర్వాత సంబంధిత రైతులతో చర్చించి కోర్టుకు వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నామని బీజేపీ నేత ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు లేబాక పాఠశాల విద్యార్థిని ఎంపిక


ఎంపికైన భవ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అరిగెల భవ్య అనే విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివరాం తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. చెన్నైలో ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారిణిని ఉపాధ్యాయులు అభినందించి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

హాకీ పోటీలకు పులివెందుల విద్యార్థి..



పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కూలు గేమ్స్ హాకీ అండర్ 14 పోటీలకు పులివెందుల విద్యార్థి ఎం.సంజయ్ ఎంపికయ్యాడు. పులివెందులలోని సెంటెన్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు దయాసిస్టర్, స్వప్న సిస్టర్ అన్నారు. నవంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కడప జిల్లా టీంలో ఆడి అత్యధిక గోల్స్ చేసి టీం విజయానికి తోడ్పడ్డారన్నారు. సంజయ్ ఎంపిక పట్ల సెంటెన్స్ స్కూలు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కడప ఉక్కుపై పాలకులు మౌనం వీడాలి


కన్యతీర్థం ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎఫ్‌బీ

జమ్మలమడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు మౌనం వీడి కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.జయవర్ధన్, మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి హిమబిందు డిమాండ్ చేశారు. శుక్రవారం కన్యతీర్థం-సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్య ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర విభజన సందర్భంలో పార్లమెంటులో ఇచ్చిన హామీని అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చినా విభజన హామీలను మాత్రం అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్నా కేంద్రంపై వత్తిడి తేకపోవడం దారుణమన్నారు. ఇంతవరకు ఉక్కు ఫ్యాక్టరీపై నోరు మెదపకపోవడం సీమ ప్రాంత అభివృద్ధిని నీరుగార్చడమేనన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సగిలిరాజేంద్ర, అరుణకుమారి, వసంత్, సుందరయ్య, లక్ష్మీనారాయణ, చరణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కడప బేసిన్‌పై విస్తృత పరిశోధనలు జరగాలి : వీసీ


మాట్లాడుతున్న కావేరీ ఓఎన్‌జీసీ జనరల్ మేనేజరు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖనిజ సంపదలకు నిలయమని. ఈ జిల్లాలో విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. పెట్రోలియం జియాలజిస్టుల సంఘం వైవీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఎక్స్‌ప్లోరింగ్ క్లాసిక్ అండ్ కార్బోనేట్ రాష్ట్ర కడప బేసిన్ ఐదురోజుల వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉందని, దానిపై లోతైన అధ్యయనం జరగాల్సి ఉందన్నారు. కావేరి ఓఎన్‌జీసీ బేసిన్ జనరల్ మేనేజరు డాక్టర్ సి.ఆర్ముగం మాట్లాడుతూ 30 మందితో కూడిన పరిశోధన బృందం సమగ్ర పరిశీలన చేస్తామన్నారు. వర్క్‌షాపు కన్వీనర్లు ప్రొఫెసరు వంగల సునీత, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఆలిండియా క్రిష్ణగోదావరి బేసిన్ అంకాళేశ్వర ఆయిల్ ఫీల్డ్, అస్సాం ఆయిల్ ఫీల్డ్ సంస్థల నుంచి 30 మంది పరిశోధకులు ఐదురోజుల పాటు జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ పర్యటన అనంతరం సర్వే నివేదిక ప్రచురించి భారత ప్రభుత్వానికి అందజేస్తారని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి వెల్లడించారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

చిట్వేలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులను శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు. గురువారం పుల్లంపేట మండలం వత్తలూరుకు చెందిన ఏరుకాళ్ల వెంకటేశ్వర్లు(32) పుల్లంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య రేవతి, ఆమె తండ్రి వెంకటయ్య, తమ్ముడు వంశీలు వేధించడంతో తమ కుమారుడు మృతి చెందాడని వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు చిట్వేలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి కేఎస్ అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసి.. రాజంపేట కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గొరిగెనూరులో ఘర్షణ

- పలువురిపై కేసు నమోదు

జమ్మలమడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిగెనూరు గ్రామంలో శుక్రవారం ఇరువర్గాలు ఘర్షణపడ్డారు. గ్రామంలో గొంగటి హేమంత్‌రెడ్డి, ఉప్పలూరు ధరణీకుమార్‌రెడ్డి వారికుటుంబసభ్యులు గొడవ పడ్డారు. ఇంటి ఎదురుగా రోడ్డు మీద నీళ్ల విషయంలో ఇరువర్గాలు మాటామాట పెరిగి రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో హేమంత్‌రెడ్డి, ధరణీకుమార్‌రెడ్డికి చిన్న చిన్న రక్తగాయాలయ్యాయి. వెంటనే జమ్మలమడుగు అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పై ఇద్దరితోపాటు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శతాధిక కవి సమ్మేళనం

కడప కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర మున్సిపల్ మైదానం వద్ద గల ఐఎంఏ హాలులో వచ్చే ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జిల్లా రచయితల సంఘం రెండో మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. ఇందులో రాయలసీమ భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం అనే అంశాలపై శతాధిక సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ఔన్నత్యాన్ని చాటి చెబుతూ 20 లైన్లలో కవిత కానీ, తేటగీతి, ఆటవెలది కంద పద్యాల్లో నాలుగు పద్యాలు కానీ, 2 లేక 3 వృత్త పద్యాలు కానీ 15వ తేదీలోపు జిల్లా శతాధిక కవి సమ్మేళనం అనే వాట్సప్ గ్రూపు లేక 9704651414, 9703912727 అనే నెంబర్లకు మీ కవిత కానీ పద్యాలు కానీ పంపించాలన్నారు. వాటిలో న్యాయ నిర్ణేతల ద్వారా మూడు ఉత్తమ కవితలను ఎంపిక చేసి ప్రథమ విజేతకు రూ.3వేలు, ద్వితీయ విజేతకు రూ.2వేలు, తృతీయ విజేతకు రూ.వెయ్యి బహుమతులు అందజేస్తామన్నారు. తదుపరి కవులు పంపిన ప్రతి కవితను మహాసభల్లో ఆ కవి ద్వారా ఆలాపన చేయించి పెద్దల సమక్షంలో శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తామన్నారు. ఈసారి మహాసభల్లో విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యతనిస్తామన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేమన శతకం, సుమతి శతకం పద్యపఠన పోటీలు, జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులకు కవితల పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులోని విజేతలకు కూడా ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందిస్తామని తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు

వేంపల్లె, డిసెంబరు 27: వేంపల్లె మండలం తాళ్లపల్లె ప్రాంతంలో కడపకు చెందిన వ్యక్తి అక్రమంగా అండర్ గ్రౌండ్ మైనింగ్ చేస్తున్నారని విజిలెన్స్ మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వారు శుక్రవారం తనిఖీ చేశారు. విజిలెన్స్ ఆర్‌ఐ రామసుబ్రమణ్యం, మైనింగ్ ఆర్‌ఐ ఆమని విజయలక్ష్మి ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లారు. రెవెన్యూ అధికారులు గైర్హాజరు కావడంతో హద్దులను గుర్తించేందుకు వీల్లేదని మరో మారు తనిఖీ చేస్తామని తిరిగి వెళ్లారు. అక్రమ మైనింగ్ ఎవరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోగొట్టుకున్న బంగారు నగల బ్యాగు అప్పగింత


బంగారు నగల బ్యాగును ప్రయాణికురాలికి అందిస్తున్న ఆర్టీసీ కంట్రోలర్, కండెక్టర్లు

పోరుమామిళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను ప్రయాణిస్తున్న ఓ బస్సు ఎక్కాల్సిన మహిళ మరో బస్సు ఎక్కింది. ఈ ఆతృతలో బంగారు నగలున్న బ్యాగును బస్సులో మరిచిపోయింది. ఆ వెంటనే గుర్తించి బస్టాండులో ఉన్న కంట్రోలర్‌కు తెలిపింది. దీంతో ఆయన ఆ బస్సు కండక్టరు నుంచి బ్యాగు తెప్పించి ఆమెకు అప్పగించారు. వివరాల్లోకెళితే... మైదుకూరు నుంచి గిద్దలూరుకు ఓ మహిళా ప్రయాణికురాలు ప్రయాణిస్తోంది. బస్సు పోరుమామిళ్ల బస్టాండుకు చేరుకోగానే ఆమె తన అవసర నిమిత్తం బస్సు దిగింది. తిరిగి ఆమె తొందరలో ఆ బస్సు కాకుండా మైదుకూరు వెళుతున్న బస్సు ఎక్కింది. ఆ వెంటనే గమనించి కిందికి దిగింది. అప్పటికే ఆమె వెళ్లాల్సిన గిద్దలూరు బస్సు వెళ్లి పోయింది. ఆమె ప్రయాణించే బస్సులో తన బంగారు ఆభరణాలున్న బ్యాగు, రెండు వేల నగదు, సెల్‌ఫోన్‌ను మరిచిపోయినట్లు గుర్తించింది. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో ఆమె కంట్రోలర్ నాగరాజును ఆశ్రయించింది. దీంతో ఆయన బస్సు కండక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి బ్యాగును తెప్పించారు. హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న 20 గ్రాములు బంగారు ఆభరణాలు, సెల్‌ఫోను, రూ.2వేలు నగదును మైదుకూరు డిపో కండక్టరు మాధవి, గిద్దలూరు డిపో కండక్టరు జయరంగరావు తో కలసి ఆమెకు అందించారు.

పక్కా గృహాల సముదాయం పరిశీలన

రామాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీలో పూర్తయిన పక్కా గృహాల సముదాయాలను శుక్రవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. జనవరి 3వ తేదీ సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా పక్కా గృహాల నిర్మాణాలను సందర్శించనున్నారని తెలిపారు. కాలనీలో రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, కరెంటు సక్రమంగా ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ సాంబశివరావు, డీఈ సుబ్బరాయుడు, ఏఈ ఏఎస్‌ఎం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ, ఐబీపీఎస్, ఆర్‌బీఐలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ కార్యదర్శి సునీత తెలిపారు. శుక్రవారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ జనవరి 1 నుంచి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిపుణులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9705333305లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవిబాబు, జేవీవీ నాయకులు రాకేష్, పవన్, హర్షిత, చంద్రకళ, అఫ్రోజ్, హరినాథ్, రాజేశ్వరి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో అయ్యప్పభక్తుల బస్సుకు ప్రమాదం

- ఆరుగురికి గాయాలు


నిలబడిన లారీని ఢీకొన్న అయ్యప్పస్వాముల బస్సు

దువ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి చెందిన అయ్యప్పస్వాములతో వెళ్లిన బస్సు ప్రమాదానికి గురైంది. ఆలస్యంగా అందించిన సమాచారం మేరకు ఈనెల 24వ తేదీ 38 మంది అయ్యప్ప భక్తులుదువ్వూరు నుంచి శబరిమలకు బస్సులో బయల్దేరి వెళ్లారు. అయ్యప్ప దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో తమిళనాడులోని రామేశ్వరంలో దేవుని దర్శించుకుని చాలా దూరం ప్రయాణించారు. 25 తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో నిలబడి ఉన్న లారీని బస్సు వేగంగా వెళ్లి ఢీకొందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సంఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలైయినట్లు బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. బస్సు చాలా మేరకు ధ్వంసం అయినట్లు చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మళ్లీ కొట్టుకుపోయింది

- 6వ సారి తెగిన తాత్కాలిక రోడ్డు
- వాగేటికోన మినీ రిజర్వాయర్ నుంచి భారీ వరద నీరు



కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

రైల్వేకోడూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు రైల్వేకోడూరు-రెడ్డివారిపల్లె తాత్కాలిక రోడ్డు ఇప్పటికే ఐదు సార్లు కొట్టుకుపోయింది. శుక్రవారం ఉదయం ఒక మోస్తరు వర్షం కురవడం, వాగేటికోన మినీ రిజర్వాయర్ నుంచి భారీగా వరద నీరు పొంగడంతో తాత్కాలిక రోడ్డుపై వరదనీరు ప్రవహించి మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో రెడ్డివారిపల్లెకు రాకపోకలు బంద్ అయ్యాయి. యథావిధిగా చుట్టూ తిరిగి రెడ్డివారిపల్లెకు ప్రజలు, రైతులు, వ్యాపారులు తదితరులు వెళ్లాల్సి వచ్చింది. తద్వారా 8 కి.మీ. దూరం ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. కాగా వాగేటికోన మినీ రిజర్వాయర్‌కు కొండ కోనల్లో నుంచి వచ్చి వరద నీరు చేరింది. అది పొంగడంతో గుంజననదికి ప్రవహించాయి. రోడ్డుపై వర్షపు నీరు వెళ్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

హెల్మెట్ పెట్టుకుని ప్రాణాలు కాపాడుకోండి

- పోలీసుల అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ చేస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్ పెట్టుకుని ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకోవాలని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరులో పోలీసులు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, రాజంపేట డీఎస్పీ నాంపల్లె సుధాకర్‌ల ఆదేశాల మేరకు హెల్మెట్లు పెట్టుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూవీలర్ వాహనదారులు హెల్మెట్ పెట్టుకోకపోవడం వల్లే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ పెట్టుకుని వాహనాలను నడపాలని సూచించారు. లేదంటే అపరాధరుసుం ఖచ్చితంగా వేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నవీన్‌బాబు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ

చిట్వేలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మానవతా చిట్వేలిశాఖ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని నక్కలపల్లెకు చెందిన పెరుగు శేషయ్యనాయుడు రెండో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు పేదలకు, పారిశుధ్య కార్మికులకు మానవతా ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మునిరావు, కార్యదర్శి సాయిరాం, ట్రెజరర్ తురక రంగారెడ్డి, సంయుక్త కార్యదర్శి రామిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, దాతలు పెరుగు వెంకటేష్, పెరుగు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యుత్ చార్జీలు పెంచిన పాపం జగన్‌దే'

సంబేపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 2019 నుంచి 2024 వరకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన పాపమే విద్యుత్ చార్జీల పెంపునకు కారణమని టీడీపీ నాయకులు రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అవినీతి, అసమర్థత వల్ల గత ఐదేళ్లలో వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం 32 వేల 116 కోట్లు కాగా, ఆ సంస్థలపై పెరిగిన అప్పులు రూ.49,596 కోట్లు అని తెలియజేశారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు చేయకుండా వాస్తవాలు మాట్లాడితే బాగుంటుందని తెలియజేశారు.

దాతల సహకారంతో ఆలయ నిర్మాణం



సంబేపల్లె, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురిగింజకుంట గ్రామం గిన్నెపల్లెలో దాతల సహకారంతో ఉపాధ్యాయుడు అంకం శంకర్‌రెడ్డి కాటమరాయుడు ఆలయ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పురోహితుడు శివశంకర్ వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయాన్ని ప్రారంభించారు. ఆలయ నిర్మాణానికి మాన్యం వెంకటరెడ్డి కుమారుడు నాగచంద్రారెడ్డి, అంకం జయచంద్రారెడ్డి, అబ్బవరం సుబ్బారెడ్డి, యండపల్లి రమేశ్‌రెడ్డి, కమలాపురం జయరామిరెడ్డి, పప్పిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, టైల్స్, గేటు దాత కొంద్రు రాచయ్య, మాన్యం హరినాథరెడ్డిలకు గ్రామ ప్రజలు ధన్యవాదలు తెలియజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సంబేపల్లె, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆంగ్ల సంవత్సర నూతన క్యాలెండర్‌ను సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆ సంఘ నాయకులతో కలిసి ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ నాయకులు ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, కోశాధికారి సుధాకర్, గౌరవ సలహాదారులు వీరాంజనేయులు, ఉపాధ్యక్షులు రామచంద్ర, నాయకులు ఆంజనేయులు పాల్గొన్నారు.

'సభ్యత్వ నమోదులో దూసుకుపోతోంది'



రాయుడుకాలనీలో సభ్యత్వ నమోదు చేపడుతున్న దృశ్యం

రాయచోటిటౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గం టీడీపీ సభ్యత్వ నమోదులో దూసుకుపోతోందని అర్చన విద్యాసంస్థల అధినేత డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ పరిధిలోని రాయుడుకాలనీ, కొత్తపేట, ఎన్జీవో కాలనీ, ఎగువ అబ్బవరం తదితర ప్రాంతాల్లో సుమారు 1500 మందితో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రెడ్డెయ్యయాదవ్, వెంకట్రమణ, రమణ, పెద్దిరెడ్డి, మాజీ కౌన్సిలర్ రామయ్య, కార్యకర్తలు రెడ్డెయ్య, రాజేంద్ర, రమణ, రవితేజ, రెడ్డిశేఖర్, సాయి, నాగయ్య తదితరులు ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

రైల్వేకోడూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సిడాప్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పెంచలయ్య తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు పట్టణం గిరిజాలేన్‌లోని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ కార్యాలయంలో ఉద్యోగ అవకాశాల కోసం నమోదు చేసుకుంటే ఉద్యోగ అవకాశాలను చూపిస్తామని తెలిపారు. అనంతరం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రైల్వేకోడూరు కో-ఆర్డినేటర్ సునీల్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

దొంగ నాటకాలను ప్రజలెవరూ నమ్మరు

- పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దొంగ నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లు వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని అన్ని విధాల నాశనం చేసిన విషయాన్ని ప్రజలు ఎప్పటికి మరచిపోరన్నారు. ఆరు నెలలుగా రాష్ట్రంలో ప్రజాపాలన చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. విద్యుత్ చార్జిల పెంపు పేరిట ధర్నా చేయడం హాస్యాస్పదమన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు 10 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన విషయాన్ని మరచిపోయారా అన్నారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి ఇప్పుడు ముసలి కన్నీరు కార్చడం సరైంది కాదన్నారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజలు నమ్మరని అన్నారు. సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం రాజంపేట మండలంలో జరిగిన వరదయ్యగారిపల్లె రెవెన్యూ సదస్సుకు టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దారు పీర్‌మున్నీ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కోవూరు సుబ్రమణ్యంనాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, మండల ఉపాధ్యక్షుడు సతీష్‌రాజు పాల్గొన్నారు.

ఎంపీడీవోపై దాడి చేసిన వారిని శిక్షించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవోపై అతని కార్యాలయంలో తాళాలు వేసి భౌతిక దాడి చేసిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అధికారులపై జరిగిన దాడులు నేడు కూటమి ప్రభుత్వ పాలనలోనూ పునరావృతం కావడం సిగ్గు చేటన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో: గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు.

లక్కిరెడ్డిపల్లె: గాలివీడు ఎంపీడీఓ జవహర్‌బాబుపై దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని స్థానిక ఎంపీడీవో రెడ్డెయ్య, సచివాలయ సిబ్బంది తరఫున మండల ఇంజనీర్ సుబ్రమణ్యంలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల పట్ల దురుసుగా మాట్లాడడం, దాడులు చేయడం అమానుషమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరి సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి

రైల్వేకోడూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ కేంద్ర ఆర్థికశాఖ మంత్రి మన్మోహన్‌సింగ్ మృతి చెందడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఈ సందర్భంగా వైసీపీ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. మన్మోహన్‌సింగ్ ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేసేటప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థలను గాడిలో పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథరెడ్డి, మండల నాగేంద్ర, తల్లం భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం ఆకస్మిక తనిఖీ

సిద్దవటం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కడప ఆర్డీవో జాన్‌ఎర్విన్ అన్నారు. మండల తహసీల్దారు కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బంది వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపై రైతులు ఫిర్యాదు చేసిన ప్రతి అర్జీ పరిష్కారం చేయాలని సూచించారు. తహసీల్దారు మాధవిలత పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

రామాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు చేపట్టిందని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారి మణి, రెవెన్యూ అధికారులు, ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా, మైనార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేటి విద్యార్థులే రేపటి సైంటిస్టులు

- సుగవాసి ప్రసాద్‌బాబు



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటి టౌన్, డిసెంబరు27(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే రేపటి సైంటిస్టులుగా ఎదగాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు హైస్కూల్‌లో కలామ్స్ విజన్-2024 సైంటిఫికెల్ ప్రాజెక్టు ప్రోగ్రాం కార్యక్రమానికి నిర్వాహకులు వినయ్‌కుమార్ ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు విచ్చేసి విద్యార్థులతో జరిగిన సభలో మాట్లాడారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. తరువాత డాక్టర్ బయారెడ్డితో కలిసి స్కూల్‌లో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ శివగంగిరెడ్డి, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు శ్రీనివాసరాజు, హరినాథరెడ్డి, వెంకట్రామరాజు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

- రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి

ఒంటిమిట్ట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసమే చంద్రబాబు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారని రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఒంటిమిట్ట రెవెన్యూ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వీరికి స్థానిక టీడీపీ నాయకులు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, తహసీల్దారు వెంకటరమణమ్మ, డిప్యూటీ తహసీల్దారు అంజనాగౌరి, మండల పార్టీ అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, కాంట్రాక్టర్ రమణ, వెంకటసుబ్బయ్య, ఆంజనేయరెడ్డి, అయ్యవారయ్య పాల్గొన్నారు.

'కుటుంబీకులకు ఉద్యోగాలు ఇవ్వాలి'

రాజంపేటటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటీలో పారిశుధ్య విభాగంలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు, అనారోగ్య కారణాల వల్ల చనిపోయిన కుటుంబాలకు తిరిగి ఉద్యోగాలు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు రామాంజులు, ప్రధాన కార్యదర్శి రమణ, పలువురు నాయకులు కలిసి మున్సిపల్ కమిషర్ సుధాకర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ప్రజలకు తప్పిన మురుగునీటి తిప్పలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దవటం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిట్టపల్లె గ్రామంలో మురుగునీటి నిల్వ వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయమై ఆంధ్రజ్యోతి పత్రికలో ఈ నెల 21న కథనం వెలువడింది. దీనిపై అధికారులు స్పందించి శుక్రవారం రహదారి పనులు చేపట్టారు. మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతి మిట్టపల్లె గ్రామంలో గ్రామ మహిళ సర్పంచ్ తుర్రా చిన్నక్క ఆధ్వర్యంలో రహదారిలో నిల్వ ఉన్న నీటిని తొలగించేందుకు రహదారి పనులు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతి సెక్రటరి రాజేష్ శుక్రవారం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వర్షాల కారణంగా ఆలస్యమైందని, పూర్తిగా రహదారి ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు.



మురుగునీరు ఉన్నచోట ప్రజలకు ఇబ్బంది లేకుండా రహదారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

జగనన్న కాలనీ రోడ్లు తనిఖీ



రోడ్లు తనిఖీ చేస్తున్న అధికారులు

పెనగలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం 2020లో బలహీన వర్గాల ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పీఎం ఏవై ద్వారా పక్కా గృహాలు మంజూరు చేసింది. ఇళ్లస్థలాలు ఇచ్చిన చోట ఎత్తుపల్లాలతో కూడుకున్న నేలలు కావడం వల్ల వాటిని చదును చేసేందుకు ఉపాధిహామీ పథకం నిధులతో బయట ప్రాంతం నుంచి నేలలను చదును చేసి వీధిరోడ్డు నిర్మించారు. ఐదేళ్ల తర్వాత తనిఖీల కోసం శుక్రవారం మండలానికి క్వాలిటీ కంట్రోల్ అధికారులు వచ్చారు. ఏపీవో మురళి అధ్యక్షతన క్వాలిటీ కంట్రోల్ ఏఈ రవిశంకర్, డీఆర్పీలు సరిత, మురళీ కొండూరు, ఈటమాపురం, సింగారెడ్డిపల్లె జగనన్న కాలనీ లేఅవుట్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పెనగలూరు ఉపాధిహామీ మాజీ ఈసీ సుబ్బరాయుడు, టీఏలు రెడ్డప్ప, వీరయ్య, ఎఫ్ఏలు సుబ్బరాయుడు, గంగాదేవి, గిరిధర్, వెంగనరసయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఓబులవారిపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీపీ రాచపల్లె హైస్కూల్లో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రాజశేఖర్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనం సుచి, శుభ్రత పాటిస్తూ రుచికరంగా ఉండాలన్నారు. అలాగే పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, సూపర్‌వైజర్ ఉషారాణి, ఎంఎల్‌హెచ్‌పీ వనిత, ఏఎన్ఎం లత, ఆషావర్కర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో చెరువులకు జలకళ

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి



గంగమ్మతల్లి పూజలో పాల్గొన్న మేడా విజయశేఖర్‌రెడ్డి

నందలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో చెరువులకు జలకళ లభించిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాటూరు చెరువు అలుగు పొంగడంతో నీటి సంఘం అధ్యక్షుడు శంకర్‌రాజు ఆధ్వర్యంలో శుక్రవారం అలుగు వద్ద విజయశేఖర్‌రెడ్డి పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో చెరువులకు జలకళ ఉట్టిపడుతోందని, సీఎం చంద్రబాబు ఎక్కడా తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా వేల కోట్లు ఖర్చుచేసి చెరువులకు సాగునీరు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాటూరు నీటి సంఘం అధ్యక్షుడు శివశంకర్‌రాజు, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ, మాజీ నీటి సంఘం అధ్యక్షుడు తోట శ్రీనివాసులు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు ఉత్సవాలకు ఏర్పాట్లు

సిద్దవటం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సయ్యద్‌షావలి దర్గా ఉరుసు మహోత్సవాల సందర్భంగా మైనార్టీలు ఘనంగా ఏర్పాట్లు చేసుకున్నారు. మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన సయ్యద్‌షావలి దర్గా మహోత్సవాల సందర్భంగా జనవరి 3, 4 తేదీల్లో గంధం, ఉరుసు కార్యక్రమాలు ఘనంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ముజావరి, సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ హిందూ, ముస్లింలు ప్రతిఒక్కరూ గందోత్సవం, ఉరుసు మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని అల్లా అనుగ్రహం పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు మధ్య సమావేశం

రాజంపేటటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారీ బందోబస్తు మధ్య రాజంపేట మున్సిపల్ సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, కౌన్సిలర్ సుధాకర్ తదితరులు మాట్లాడుతూ రాజంపేటలో పారిశుధ్య చర్యలు దారుణంగా మారాయని, కొన్నిచోట్ల చెత్తా చెదారం పేరుకుపోయి మురుగునీటితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు మాట్లాడుతూ త్వరలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు.

ప్రజలపై కరెంటు చార్జీల పిడుగు

- మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్‌కుమార్‌రెడ్డిల ధ్వజం



ధర్నాలో పాల్గొన్న మేడా రఘునాథ్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి

రాయచోటిటౌన్, డిసెంబరు 27: ప్రజలపై కూటమి ప్రభుత్వం కరెంటు చార్జీల పిడుగు వేసిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్ కుమార్‌రెడ్డిలు ధ్వజమెత్తారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ పిలుపు మేరకు వైసీపీ పోరుబాటలో భాగంగా కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారానికి వ్యతిరేకంగా శుక్రవారం వారు రాయచోటి పట్టణంలోని ఏపీఎస్పీడీసీఎల్ (విద్యుత్‌శాఖ) ఎస్ఈ కార్యాలయం వద్ద వైసీపీ నేతలు, కార్యకర్తలతో నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్‌శాఖ జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: విద్యుత్ చార్జీలను తగ్గించకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరులో వైసీపీ రాష్ట్ర అధిష్టానం పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా రైల్వేకోడూరు రాజ్ కన్వెన్షన్ నుంచి విద్యుత్ ఏడీఈ కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ ఏడీఈ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు.

రాజంపేట: రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచినందుకు నిరసనగా వైసీపీ నాయకులు రాజంపేట డివిజనల్ విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంక పోరంబోకు స్థలం పరిశీలన

గుర్రంకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 503/8లో 1.01 ఎకరాల వంక పోరంబోకు స్థలం ఆక్రమణలను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములైన చెరువులు, కుంటలు, వాగులు, వంకలను ఆక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లను అడిగి వంక ఎంతమేర ఆక్రమణలకు గురైందో వివరాలను సేకరించారు. ఆక్రమణలకు గురైన వంక పోరంబోకు స్థలం చుట్టూ ట్రెంచ్ కొట్టి బోర్డును ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే రియల్ వ్యాపారులు అక్రమంగా మట్టి తవ్విన గుట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ అధికారుల అనుమతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయరు వినోద్ పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజీలో..
నూతన ఒరవడి


కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్రాలు

- రూ.20లక్షలతో చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్
- ఆధునిక యంత్రాలతో విద్యార్థులకు బోధన, వ్యాపారం
- ప్రజలూ వినియోగించుకునేందుకు అవకాశం

పులివెందుల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజీలో అటు ప్రజలు, ఇటు విద్యార్థుల కోసం చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైంది. ఆధునిక యంత్రాలతో కళాశాల యాజమాన్యం దీనిని అందరికీ అందుబాటులోకి తెచ్చింది. చిరుధాన్యాలు (మిల్లెట్స్) శుద్ధి చేయడం, వారికి కావాల్సిన విధంగా పిండి, రవ్వ రూపంలో తయారుచేయడం దీని ప్రత్యేకత. ఒకేచోట ఆరు యంత్రాలతో మిల్లెట్ ప్రాసెసింగ్ చేయడం జిల్లాలోనే మొట్టమొదటి యూనిట్‌గా చెప్పవచ్చు.

గతంలో చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేయాలంటే చాలా శ్రమతో కూడిన పని. ఇళ్లలో అమ్మమ్మ, నాయనమ్మ చిరుధాన్యాలను రోట్లో వేసి దంచి వాటిని చాటల సాయంతో శుద్ధి చేసేవారు. అనంతరం వాటిని విసుర్రాయి సాయంతో పిండిగాని, రవ్వగాని తయారుచేసేవారు. చిరుధాన్యాల ప్రాసెస్ పెద్ద శ్రమతో కూడుకున్న పని కావడం, ప్రజలు బియ్యానికి అలవాటు పడ్డంతో వీటి వాడకం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఇప్పుడంతా రెడీ ఫర్ కుక్ (వంటచేసుకునేందుకు సిద్ధం) అన్నట్టుగా బియ్యం పిండి, గోధుమపిండి, జొన్నపిండి, రాగిపిండి తదితర వాటిని వినియోగిస్తున్నారు. రానురాను మన పూర్వీకుల ఆహారపు అలవాట్లు మంచిగా ఉండేవని, మళ్లీ అటు వైపే ప్రజలు మళ్లుతున్నారు. ఈ నేపథ్యంలో చాలామంది చిరుధాన్యాల వాడకం వైపు వస్తున్నారు. అయినా చిరుధాన్యాల ప్రాసెస్ ఇప్పటి మహిళలకు పెద్ద సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో పులివెందులలో ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజీలో నూతన ఒరవడికి నాంది పలికారు. ఇక్కడ ఆధునిక యంత్రాలతో చిరుధాన్యాల ప్రాసెస్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు.


రాగులను శుద్ధి చేయక ముందు..చేసిన తర్వాత


రాగులను ఎలా శుద్ధి చేయాలో విద్యార్థులకు వివరిస్తున్న డీన్, అధ్యాపకులు

అందరికీ అందుబాటులో..

మన చుట్టుపక్కల ప్రాంతాల్లో కొర్రలు, జొన్నలు, రాగులు, సద్దలు తదితర చిరుధాన్యాలను రైతులు పండిస్తున్నారు. వీటిని రైతుల వద్ద కొని పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కాలేజీలో ఏర్పాటుచేసిన ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలిస్తే చాలు. అక్కడ కళాశాల విద్యార్థులు, సిబ్బంది మార్కెట్‌లో దొరుకుతున్న చిరుధాన్యాల కంటే శుద్ధిగా మనకు కావాల్సిన విధంగా తయారుచేసి ఇస్తారు.

ఉదాహరణకు ఒకరైతు వద్ద రాగులు పది కిలోలు కొని ఈ ప్రాసెసింగ్ యూనిట్‌కు తీసుకెళ్తే అక్కడ మొదట ఒక యంత్రం ద్వారా రాగుల్లో ఉన్న చెత్తాచెదారం, రాళ్లు, మట్టి, ఇసుక తదితర వాటిని పూర్తిగా శుద్ధిచేస్తుంది. అలా శుద్ధి అయిన రాగులను మరో యంత్రంలో వేస్తే అందులో రాగులకు ఉన్న పొట్టును 90శాతం తొలగిస్తుంది. పక్కనున్న మరో యంత్రలో రాగులను వేస్తే వీటిలో ఇతర చిరుధాన్యాలు ఏవైనా కలిసి ఉంటే వాటిని వేరుచేస్తుంది. అనంతరం పూర్తిస్థాయిలో పిండికావాలి ఉంటే మరో యంత్రంలో వేయాలి. అదే జొన్నలు గాని, గోధుమలు గాని రవ్వ చేసేందుకు మరో యంత్రం అక్కడే ఉంది. ఈ ప్రాసెసింగ్ అంతా కేవలం నిమిషాల వ్యవధిలోనే జరిగిపోతుంది. ఆంధ్రజ్యోతి అక్కడకు వెళ్లిన సమయంలో పది కిలోల తూకం చూసి ప్రాసెసింగ్ చేశారు. ప్రాసెసింగ్ చేసిన అనంతరం 450 గ్రాములు శుద్ధిరూపంలో బయటకు పోయింది. మిగిలిన 9.550 కిలోలు మళ్లీ తూకం వేసి చూపించారు. ఈ ప్రాసెసింగ్ చేయడానికి కిలోకు రూ.5 వసూలు చేస్తామని కళాశాల డీన్ మాధవ పేర్కొన్నారు.

విద్యార్థులకు బోధన, వ్యాపారం

ఒకప్పుడు చిరుధాన్యాలు బాగా ఉపయోగించినా అనంతరం వీటి వాడకం క్రమంగా తగ్గిపోయింది. ఇటీవల ప్రజలు చాలా మంది ఏదో ఒక అనారోగ్యం బారిన పడుతున్నారు. దీంతో మళ్లీ మన పూర్వీకుల ఆహారపు అలవాట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో చిరుధాన్యాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. కానీ చిరుధాన్యాల ప్రాసెసింగ్ చాలా శ్రమతో కూడుకున్నది. దీన్ని గుర్తించి పులివెందుల ఫుడ్ అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాల దాదాపు రూ.20లక్షలతో ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసి చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది.

దీని ద్వారా చిరుధాన్యాలను ప్రాసెసింగ్ ఎలా చేయాలో విద్యార్థులకు టెక్నికల్‌గా బోధించే అవకాశం కలుగుతోంది. అలాగే ప్రాసెస్ చేయడం ద్వారా కళాశాలకూ కొంత ఆదాయం సమకూరుతోంది. అలాగే రైతుల వద్ద కొని తెచ్చిన వివిధ రకాల చిరుధాన్యాలను ప్రాసెసింగ్ చేసి ప్యాకెట్ల రూపంలో వాటిని మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. విద్యార్థులు చిరుధాన్యాలను ప్రాసెస్ చేయడమే కాకుండా వాటిని మార్కెటింగ్ చేయడం కూడా ఈ బోధనలో ఒక అంశం. కిలో చిరుధాన్యం ప్రాసెసింగ్ చేస్తే రూ.5 వసూలు చేస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. తమ కళాశాలలోని చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది.

గొర్రెల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

రైల్వేకోడూరుకు చెందిన ఒకరు మృతి, 8 మందికి తీవ్రగాయాలు



కందల సోమయ్య మృతదేహం, వ్యాన్‌లో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీస్తున్న పోలీసులు

రైల్వేకోడూరు/గూడూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా గూడూరు రూరల్ సర్కిల్ పరిధి లోని గోగినేనిపురం సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రైల్వేకోడూరుకు చెందిన ఒకరు మృతి చెందగా 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. గూడూరు పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైల్వేకోడూరు నుంచి గూడూరు సంతకు గొర్రెలను మినీ వ్యాన్‌లో తరలిస్తుండగా గూడూరు గోగినేనిపురం సమీపంలో లారీ ఢీకొంది. ఈ సంఘటనలో రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లె పంచాయతీ పిట్లావాండ్లపల్లెకు చెందిన కందల సోమయ్య (45) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేకోడూరు పట్టణంలోని ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన రమణయ్య, చిట్వేలి మండలంలోని చిన్నరాసపల్లెకు చెందిన కట్టా ఈశ్వరయ్య, రైల్వేకోడూరు పట్టణంలోని ధర్మాపురానికి చెందిన తుంగా భాస్కర్, చిట్వేలి మండలంలోని నాగవరానికి చెందిన దాడిశెట్టి సుబ్రహ్మణ్యం, ఓబులవారిపల్లె మండలం దళితవాడకు చెందిన సిబ్యాల చినవెంకటయ్య, రైల్వేకోడూరు పట్టణం ఆంజనేయస్వామి గుడి వీధికి చెందిన నార్జాల రమణయ్య, రైల్వేకోడూరు మండలంలోని తిమ్మిశెట్టిపల్లెకు చెందిన ఆరిబోయిన పెంచలయ్య, రైల్వేకోడూరుకు చెందిన నార్జాల సూర్యప్రకాష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రమాదంలో మినీ వ్యాన్ దెబ్బతింది. వ్యాన్‌లో కొందరు ఇరుక్కుపోవడంతో పోలీసులు, స్థానికులు కలసి సహాయక చర్యలు చేపట్టి వెలికితీశారు. మృతిచెందిన వ్యక్తి, ప్రయాణించే వ్యక్తులు అందరూ గొర్రెల వ్యాపారులని పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వ్యాన్ టాప్‌లో ఉన్నాడని, లారీ ఢీకొట్టడంతో ఒక్కసారిగా సోమయ్య కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గొర్రెలను ఇతర వాహనంలో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గూడూరు మనోజ్‌కుమార్ తెలిపారు.

సుదర్శన్‌రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేయాలి


రాయచోటి ఏరియా ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

రాయచోటిటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి చేసిన గాలివీడు మాజీ ఎంపీపీ, వైసీపీ నాయకుడు జల్లా సుదర్శన్‌రెడ్డిపై రౌడీషీట్ ఓపెన్ చేసి హత్యాయత్నంతో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని జిల్లా ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డెయ్య, ప్రధాన కార్యదర్శి రవిశంకర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు, భారతీయ అంబేడ్కర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లం తాతయ్య, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, పౌరహక్కుల నాయకుడు వంగిమళ్ల రమణ, వడ్డెర విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్, ఉపాధ్యాయ సంఘాలు, ఎన్జీవో నాయకులు, కార్మిక సంఘాల నాయకులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుదర్శన్‌రెడ్డి తల్లి ఎంపీపీ అయినప్పటికీ... ఆయన ఆఫీసులో పెత్తనం చెలాయిస్తూ తాను చెప్పినట్లు అధికారులు వినాలనడం సరికాదని ఆరోపించారు. సుదర్శన్‌రెడ్డి ఎంపీపీ సభాభవనంలో ఉండేందుకు ఏ విధమైన అర్హత లేదని, అలాంటి వ్యక్తి దాడి చేయడం అన్యాయమన్నారు. ఈయనకు న్యాయవాది లక్షణాలు ఏమీ లేవని, రౌడీలాగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వ్యక్తులకు సమాజంలో ఉండే అర్హత లేదని, శాశ్వతంగా జైల్లో ఉండాలని వారు డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులో బాహాబాహి


ఇరువర్గాల వారు ఘర్షణ పడుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్టలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రెండు వర్గాలకు చెందిన టీడీపీ నాయకులు బాహాబాహికి దిగారు. వివరాలిలా... స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ముందుగా రాజంపేట టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఇతర మండలాలకు చెందిన వ్యక్తులతో సమావేశానికి హాజరయ్యారు. అదే సమయానికి సీనియర్ టీడీపీ నాయకుడు, కల్లుగీత కార్మిక సంఘం మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులతో కలిసి సమావేశానికి హాజరయ్యారు. మండల కేంద్రమైన ఒంటిమిట్టలో ఉన్న తమకు కాకుండా ఇతర మండలాలకు చెందిన వ్యక్తులను ఎలా వేదికపై కూర్చొబెడతారని తహసీల్దారును నిలదీశారు. స్థానికంగా ఉన్న వారికి సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. ఒంటిమిట్టకు చెందిన టీడీపీ నాయకులు సమావేశానికి హాజరుకాగానే సమావేశం నుంచి సుగవాసి సుబ్రమణ్యం తన వర్గీయులతో వెనుదిరిగారు. అనంతరం మాజీ మండలాధ్యక్షుడు పామూరు సుబ్రమణ్యం మాట్లాడుతూ ఇది రాజకీయ సమావేశమా? ప్రజల కోసం ఏర్పాటు చేసిన సమావేశమా? అని ప్రశ్నించడంతో ఇతర ప్రాంతాలకు చెందిన వారు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. ఒంటిమిట్టలో ఉన్న స్థానిక టీడీపీ నాయకులకు సమాచారం ఇవ్వకుండా వేదిక మీద లేకుండా ఇతర మండలాలకు సంబంధించిన వ్యక్తులను, ఇతర పంచాయతీ వ్యక్తులను కూర్చొబెట్టడంలో ఆంతర్యమేమిటని తహసీల్దారును గట్టిగా నిలదీయడంతో అరుపులు, కేకలతో సమావేశం దద్దరిల్లింది. ఇదిలా ఉండగా అక్కడే ఉన్న స్థానిక సీపీఎం నాయకుడు యానాదయ్య తహసీల్దారుకు మద్దతు పలకడంతో మరింత వివాదం చోటు చేసుకుంది. తమ పార్టీకి సంబంధించిన విషయంలో సీపీఎం పార్టీకి సంబంధించిన వ్యక్తికి ఏం పని అని టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో ఇరువర్గాల వారు స్టేజీ వద్ద అరుపులు, కేకలతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలకు సర్దిజెప్పి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ స్థానికంగా ఉన్న వారి సలహాల మేరకు సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పడంతో సదస్సును నిర్వహించారు.

కాల్పుల ఘటనలో నిందితుడు అరెస్ట్

- నాటు తుపాకీ మందుగుండు సామగ్రి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్


వివరాలు వెల్లడిస్తున్న రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్

రాయచోటిటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట, మాధవరం గ్రామాలకు సరిహద్దు ప్రాంతంలో గల దేవరగుట్ట సమీపంలో ఈనెల 22వ తేదీ జరిగిన నాటుతుపాకీ కాల్పుల ఘటనలో నిందితుడు ముడి రమణప్పనాయుడును శుక్రవారం రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం గురికానివాండ్లపల్లెకు చెందిన ముడి నాగప్పనాయుడు కుమారుడు రమణప్పనాయుడు తన తండ్రి కాలం నుంచి 40 సంవత్సరాలుగా ఒక నాటు తుపాకీని ఉపయోగిస్తూ అడవి జంతువులను వేలాడుతూ ఉండేవారన్నారు. ఈ క్రమంలోనే ఈనెల 21వ తేదీ శనివారం రాత్రి తన ఇంట్లో ఉన్న నాటు తుపాకీని తీసుకొని కాటిమాయకుంట గ్రామానికి పడమర వైపు గల దేవరగుట్ట సమీపానికి పోయి అడవి పందుల కోసం మాటు వేసి ఉన్నాడు. సంబేపల్లె మండల కేంద్రంలోని నామాలగుట్టకు చెందిన పూసల కులానికి చెందిన నీలకంఠం హనుమంతు, అతడి బంధువు రమణ కూడా అదేరోజు సాయంత్రం అడవి జంతువుల కోసం దేవరగుట్ట ప్రాంతంలో వలలు వేసి ఇళ్లకు వచ్చారు.

తెల్లవారుజామున సుమారు 4 గంటల ప్రాంతంలో హనుమంతు, రమణ వలలు వేసిన ప్రాంతానికి పోయి అక్కడ వలలో ఏవైనా అడివి జంతువులు పడ్డాయా అని వెతకుతుండగా అక్కడే పందుల కోసం ముందుగానే నాటుతుపాకీతో మాటు వేసి ఉన్న రమణప్పనాయుడు, హనుమతు, రమణల అలికిడి విని అడవి పందులు అనుకుని తన వద్ద ఉన్న తుపాకీతో కాల్చాడు. దీంతో తుపాకీ గుండ్లు వెళ్లి హనుమంతు, రమణలకు తగలడంతో వారు గట్టిగా అరిచి వలలను అక్కడే వదిలి రక్తగాయాలతో తమ ఇళ్ల వద్దకు వెళ్లగా వారి బంధువులు గాయాలతో ఉన్న వారిని చికిత్స కోసం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం వారిద్దరినీ కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హనుమంతు మృతి చెందగా రమణ కోలుకుంటున్నాడని తెలిపారు. శుక్రవారం సాయంత్రం నిందితుడు ముడి రమణప్పనాయుడు అరెస్టు చేసి అతడి వద్ద నుంచి నాటు తుపాకీ దానిలో వాడే మూడు రకాల గుండ్లు, నల్ల మందును స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. కాల్పుల ఘటన కేసులో వేగవంతంగా క్లూస్ కనిపెట్టడంతో పాటు ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనపర్చిన అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్ జహీర్, శ్రీనివాస్‌నాయక్‌తో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అభినందించారు.

అప్పనంగా లక్షలు అప్పజెప్పారు...

- పనులు చేయకున్నా బిల్లులు
- అభివృద్ధి నిధులు పెద్దల పాలు
- ఫిర్యాదులతో గట్టు రట్టు

సుండుపల్లె, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలన ఆ పార్టీ నేతలకు ఆదాయ వనరుగా మారింది. అధికారమే పెట్టుబడిగా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. అధికారులు కూడా వైసీపీ నేతల మాటలకు తలవంచి పనులు చేయకుండానే సుండుపల్లె మండలంలో లక్షలాది రూపాయల బిల్లులు చేసినట్లు విచారణలో బట్టబయలవుతోంది. మండల అభివృద్ధి నిధుల నుంచి పంచాయతీ నిధులు రైతులకు ఉచితంగా పంపిణీ చేసే వ్యవసాయ పనిముట్లు, సంక్షేమ పథకాలకు కూడా గండికొట్టారు.

అధికార పార్టీలో కీలకంగా వ్యవహరించిన, ప్రజాప్రతినిధుల అనుచరులు చెప్పినట్లు చెయ్యక తప్పలేదని తప్పులు చేశామని కొంతమంది అధికారులు ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మండల అభివృద్ధి నిధులు, గ్రామ పంచాయతీల అభివృద్ధి నిధులు పక్కదారి పట్టాయని సుమారు రూ.70 లక్షల వరకు దొంగ బిల్లులు పెట్టి ప్రజాప్రతినిధులు, వైసీపీ నేతలు, అధికారులు పంచుకున్నారని విచారణ చేపట్టాలని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అధికారులు విచారణ చేస్తున్నారు. విచారణను సైతం ప్రస్తుతం అధికార పార్టీలో పలుకుబడి ఉన్న వ్యక్తుల సహాయంతో పక్కదారి పట్టించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని విమర్శలు ఉన్నాయి.

రోడ్డు వేయకుండానే...

వైసీపీ పాలనలో అభివృద్ధికి తూట్లు పొడుస్తూ మండల అభివృద్ధికి, గ్రామ పంచాయతీల అభివృద్ధికి, గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి వచ్చిన నిధులను అసలు పనులే చేయకుండా బిల్లులు పెట్టుకునే సంప్రదాయానికి తెరలేపారు. సుండుపల్లె మండలం చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీలో అప్పయ్యగారిపల్లెలో సీసీ రోడ్డు వేసినట్లు రూ.1,77,975 బిల్లు చేశారని ఆరోపణలు ఉన్నాయి. స్థానికుల ఫిర్యాదుతో జిల్లా ఉన్నతాధికారుల విచారణతో ఈ విషయం వెలుగు చూసింది. అధికారికంగా అధికారులు సంతకాలు పెట్టి ప్రభుత్వ ముద్రలతో ఎం-బుక్కులు రెడీ చేసి చెయ్యని పనికి నిధులు డ్రా చేయడంతో గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. మీ అవినీతికి కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని, కారణమైన వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టాలని కూటమి నేతలు డిమాండ్ చేస్తున్నారు. 2016 టీడీపీ హయాంలో చేసిన పనులకు 2022-23 సంవత్సరం వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు డ్రా చేసినట్లు మరికొంతమంది చెబుతున్నారు.


పనులు చేయకుండానే బిల్లులు చేసినట్లు ఆరోపణలు వస్తున్న అప్పయ్యగారిపల్లె రోడ్డు

చెయ్యమన్నారు.. చేతులెత్తేశారు....:

మా ప్రభుత్వం ఎమ్మెల్యే, ఎంపీ మనవాళ్లే ఇబ్బంది లేదు నేను చూసుకుంటాను. బిల్లులు చేయండి.. ఇచ్చింది తీసుకోండి అని మాతో తప్పుడు పనులు చేయించారు. ప్రభుత్వం మారింది. మమ్మల్ని కాపాడండి మహాప్రభో అని కొంతమంది అధికారులు నేతలు, ప్రజాప్రతినిధుల దగ్గరికి పరుగులు తీస్తున్నారు. మాకేం సంబంధం మీ సంతకాలతో నిధులు డ్రా చేశారు. మీరే అనుభవించండి అని చెబుతున్నారని సమాచారం. లక్షలాది రూపాయలు అక్రమంగా పెట్టిన బిల్లులు తీసుకుని చేతులెత్తేశారని అధికారులు వాపోతున్నారు. తప్పు చేశాము. జీవితంలో ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చేయమని కొంతమంది మదనపడుతున్నారు. మండల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదు చేయడంతో డిప్యూటీ సీఈవో రమణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి బాలకృష్ణారెడ్డిలు విచారణ నిర్వహించారు. ఈ విచారణలో పెద్ద మొత్తంలో అక్రమాలు జరిగినట్లు తేలిందని స మాచారం. ఇప్పటికే విచారణలో రూ.5,03,160 లక్షలు రికవరీ చేశారు. రికవరీ డబ్బులు కూడా కొంతమంది అధికారులే చెల్లించినట్లు సమాచారం. కొంతమంది వైసీపీ నేతల మాటలు విని తప్పులు చేశాము. ఉద్యోగాలు కాపాడుకునేందుకు తప్పడం లేదని తమ జీతాల నుంచి వచ్చిన డబ్బును చెల్లించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిన్నగొల్లపల్లె పంచాయతీలో పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఫిర్యాదులు అందాయి. విచారణ జరుగుతోంది. మరో ఐదు గ్రామ పంచాయతీల్లో పెద్ద మొత్తంలో పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.

> **విచారణ జరుగుతోంది**
>
> గత ప్రభుత్వంలో నిధులు దుర్వినియోగం అయ్యాయని మండలానికి చెందిన కొంతమంది ఫిర్యాదు చేశారు. విచారణ జరుగుతోంది. కొంత డబ్బును ప్రభుత్వానికి తిరిగి చెల్లించాము. విచారణ పూర్తయితే పై అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.
>
> -సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె



సుండుపల్లె మండల అభివృద్ధి కార్యాలయం - మండల నిధుల దుర్వినియోగంపై విచారణ చేస్తున్న జిల్లా అధికారులు (ఫైల్)

‘మీసేవ’కు పూర్వ వైభవం వచ్చేనా...

- వైసీపీ ప్రభుత్వంలో మీసేవ కేంద్రాలకు గ్రహణం
- సచివాలయ వ్యవస్థతో నిర్వీర్యం
- ఆదాయం లేక నడపలేక, మూసివేయలేక అయోమయంలో నిర్వాహకులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

రైతులకు 1బి అడంగల్ పత్రాలు, విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు, బర్త్, డెత్ సర్టిఫికెట్లు కావాల్సి వస్తే మీసేవ కేంద్రాలకు పరుగులు తీసేవారు. ఇక నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లించాలన్నా.. ఓటరు కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలన్నా.. మీ సేవా కేంద్రాలే గుర్తుకు వచ్చేవి. అవన్నీ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయి. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మీ సేవ కేంద్రాలను నిర్వీర్యం చేసింది. సచివాలయాల వ్యవస్థను తీసుకురావడంతో మీసేవ, ఏపీ ఆన్‌లైన్ కేంద్రాలు ఆదరణ కోల్పోయాయి. దీంతో నిర్వాహకులు అటు కేంద్రాలు నడపలేక, మూయలేక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో మీ సేవకు పూర్వవైభవం వస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.



పులివెందులలో ఓ మీసేవ కేంద్రం

పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గత ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్ర బాబు మీసేవ కేంద్రాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు వివిధ రకాల సేవలు అందించేలా వాటిని తీర్చిదిద్దారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మీసేవ కేంద్రాలు మూతబడ్డాయి. అప్పటి నుంచి ప్రభుత్వ ఆదరణ లేక ఏపీ ఆన్‌లైన్, మీసేవ కేంద్రాలు కొట్టుమిట్టాడుతున్నాయి. కడప జిల్లాలో అర్బన్ సెంటర్లు కడప 5, ప్రొద్దుటూరు 3, జమ్మలమడుగు 1, పులివెందుల 1, రాయచోటి 1 ఉండేవి. అంతేకాకుండా ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు జిల్లాలో మొత్తం 320 కేంద్రాలు ఉండేవి. 40 అర్బన్ ఫ్రాంచైజీలు సెంటర్లు ఉండేవి. 2011లో ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ సీసీఎస్ భాగస్వామ్యంతో మీసేవ కేంద్రాలను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2014లో చంద్ర బాబు అధికారంలోకి వచ్చాక వీటి ప్రాధాన్యత పెరిగింది. పరిమితంగా ఉన్న సేవలను 350 వరకు పెంచారు. దీంతో మీ సేవ కేంద్రాలు కీలకంగా మారాయి. ఆపరేటర్లకు చేతినిండా పని ఉండేది. వారి జీవనం సాఫీగా జరిగేది.

సచివాలయాల రాకతో...

2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటు అయ్యాక మీ సేవ కేంద్రాలు నిర్వీర్యమయ్యాయి. ప్రభుత్వ సర్వీసులన్నీ సచివాలయంలోనే అప్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో ప్రతి ఒక్కరూ సచివాలయాల బాట పట్టారు. మీసేవ కేంద్రాలకు వెళ్లేవారు కరువయ్యారు. అంతేకాకుండా జిల్లాలో ఉన్న 11 అర్బన్ సేవా కేంద్రాలు పూర్తిస్థాయిలో మూతబడ్డాయి. గతంలో రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, వ్యవసాయ భూముల కొనుగోలులో మ్యుటేషన్ పత్రాలు మీసేవలో జారీ చేసేవారు. సచివాలయాల రాకతో అవన్నీ మాయం అయ్యాయి. ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు అర్బన్ ఫ్రాంచైజీలు ఆదాయం లేకపోవడంతో కొందరు మూసివేశారు. మరికొందరు మూయలేక, నడపలేక అయోమయంలో ఉన్నారు.

అన్నివేళలా అందుబాటులో మీ సేవలు

మీసేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ఉదయం నుంచి రాత్రివరకు పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో మీసేవ కేంద్రాలు పనిచేస్తున్నాయి. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్లు, పన్నులు, బిల్లులు చెల్లింపులకు ఈ కేంద్రాలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవి. అనేక ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన మీసేవలకు వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చింది. సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలోనే మీసేవ కేంద్రాల్లో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవని అధికారులు కూడా సచివాలయాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం కూడా మీసేవ కేంద్రాలను పరిగణనలోకి తీసుకోరాదని హెచ్చరించడంతో అధికారులు కూడా మీసేవలను దూరం పెట్టారు. దీంతో మీసేవలకు ప్రజలు దూరమయ్యారు. ఈ క్రమంలో మీసేవ కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థిక ఇక్కట్లతో కొందరు కేంద్రాలు నడపలేక మూసి వేశారు.

సచివాలయాల్లో సేవలు ఉన్నా....

గ్రామ, వార్డు సచివాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకే అందుబాటులో ఉంటాయి. ఈ కారణంగా వివిధ పనులు ఉద్యోగాలకు వెళ్లే వారికి ఆశించిన విధంగా సచివాలయాల సేవలు ఉపయోగపడడం లేదనే విమర్శలున్నాయి. ఇక రెవెన్యూ, వ్యవసాయ పౌర సరఫరాలు, విద్యుత్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ వంటి సేవలు అందిస్తామన్న ఆయాశాఖల నుంచి అధికారులు మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తులు ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యారు.

అంతా... గందరగోళం..

ఇక సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్ ఇన్ కమ్ ఫ్యామిలీమెంబరు సర్టిఫికెట్లకు ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీసేవ కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. పీడీఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలు సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని.. సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీ సేవ కేంద్రాలు నిరాకరిస్తున్నాయి. సచివాలయాలు, మీసేవ కేంద్రాల మధ్య నెలకొన్న గందరగోళంలో అర్జీదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

గత ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో కడప జిల్లా మీసేవ ఆపరేటర్లు లోకేశ్‌ను కలిశారు. మీసేవలు కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వస్తే సచివాలయాల వ్యవస్థ రద్దు చేస్తారని ఊహాగానాలు వినిపించాయి. అదే జరిగితే మీ సేవ కేంద్రాలు పూర్వవైభవం సంతరించుకుంటాయని నిర్వాహకులు భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో నిర్వాహకులు అప్పుడు ఇప్పుడు అంతేనంటూ పెదవి విరుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో సీఎం చంద్రబాబునాయుడు మీ సేవా కేంద్రాలకు పూర్వవైభవం తెస్తారని భావిస్తున్నారు.

రైతులకు శాశ్వత రస్తా సౌకర్యం కల్పించండి

- జువారి అధికారులకు ఆర్డీఓ ఆదేశం

ఎర్రగుంట్ల, డిసెంబరు 27: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి నుంచి ఎర్రగుడిపాడు రస్తాలో జువారి రైల్వేట్రాక్ వద్ద రైతులకు శాశ్వత రస్తా పరిష్కారం చూపాలని జమ్మలమడుగు ఆర్డీఓ తేజశ్రీ జువారి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఎర్రగుంట్ల బీజేపీ నేత కత్తి ప్రతాప్‌రెడ్డి మరికొందరు రైతులు రైల్వే ట్రాక్‌వద్ద రస్తా లేకపోవడంతో మూడు దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు, ఆర్డీఓకు, జువారి అధికారులకు రిజిస్టర్ పోస్టుల ద్వారా ఫిర్యాదు చేశారు. ఎర్రగుడిపాడు రస్తా పూర్వం నుంచి ఉందని, జువారి రైల్వే ట్రాక్ వేసిన తర్వాత ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, రైతులు ట్రాక్‌పైనుంచి వెళ్లాలన్నా, దాటాలన్నా తీవ్ర ఇబ్బందులున్నాయి. ఇందుకు స్పందించిన ఆర్డీఓ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారికి సరైన శాశ్వత రస్తా సౌకర్యం కల్పించాలని ఆర్డీఓ జువారి యాజమాన్యాన్ని ఆదేశిస్తూ లేఖ రాశారు. వారి స్పందన చూసిన తర్వాత సంబంధిత రైతులతో చర్చించి కోర్టుకు వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నామని బీజేపీ నేత ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు లేబాక పాఠశాల విద్యార్థిని ఎంపిక


ఎంపికైన భవ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లేబాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న అరిగెల భవ్య అనే విద్యార్థిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శివరాం తెలిపారు. ఈనెల 21, 22 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. చెన్నైలో ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఆ క్రీడాకారిణిని ఉపాధ్యాయులు అభినందించి భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

హాకీ పోటీలకు పులివెందుల విద్యార్థి..



పులివెందుల టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కూలు గేమ్స్ హాకీ అండర్ 14 పోటీలకు పులివెందుల విద్యార్థి ఎం.సంజయ్ ఎంపికయ్యాడు. పులివెందులలోని సెంటెన్స్ ఇంగ్లీషు మీడియం స్కూలు విద్యార్థి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు దయాసిస్టర్, స్వప్న సిస్టర్ అన్నారు. నవంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కడప జిల్లా టీంలో ఆడి అత్యధిక గోల్స్ చేసి టీం విజయానికి తోడ్పడ్డారన్నారు. సంజయ్ ఎంపిక పట్ల సెంటెన్స్ స్కూలు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కడప ఉక్కుపై పాలకులు మౌనం వీడాలి


కన్యతీర్థం ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎఫ్‌బీ

జమ్మలమడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాప్రతినిధులు మౌనం వీడి కేంద్రంపై వత్తిడి తీసుకురావాలని అఖిలభారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.జయవర్ధన్, మహిళా సమితి రాష్ట్ర కార్యదర్శి హిమబిందు డిమాండ్ చేశారు. శుక్రవారం కన్యతీర్థం-సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్య ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ రంగంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని, రాష్ట్ర విభజన సందర్భంలో పార్లమెంటులో ఇచ్చిన హామీని అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చినా విభజన హామీలను మాత్రం అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు గడుస్తున్నా కేంద్రంపై వత్తిడి తేకపోవడం దారుణమన్నారు. ఇంతవరకు ఉక్కు ఫ్యాక్టరీపై నోరు మెదపకపోవడం సీమ ప్రాంత అభివృద్ధిని నీరుగార్చడమేనన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సగిలిరాజేంద్ర, అరుణకుమారి, వసంత్, సుందరయ్య, లక్ష్మీనారాయణ, చరణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కడప బేసిన్‌పై విస్తృత పరిశోధనలు జరగాలి : వీసీ


మాట్లాడుతున్న కావేరీ ఓఎన్‌జీసీ జనరల్ మేనేజరు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా ఖనిజ సంపదలకు నిలయమని. ఈ జిల్లాలో విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. పెట్రోలియం జియాలజిస్టుల సంఘం వైవీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఎక్స్‌ప్లోరింగ్ క్లాసిక్ అండ్ కార్బోనేట్ రాష్ట్ర కడప బేసిన్ ఐదురోజుల వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. జిల్లాలో అపారమైన ఖనిజ సంపద ఉందని, దానిపై లోతైన అధ్యయనం జరగాల్సి ఉందన్నారు. కావేరి ఓఎన్‌జీసీ బేసిన్ జనరల్ మేనేజరు డాక్టర్ సి.ఆర్ముగం మాట్లాడుతూ 30 మందితో కూడిన పరిశోధన బృందం సమగ్ర పరిశీలన చేస్తామన్నారు. వర్క్‌షాపు కన్వీనర్లు ప్రొఫెసరు వంగల సునీత, డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఆలిండియా క్రిష్ణగోదావరి బేసిన్ అంకాళేశ్వర ఆయిల్ ఫీల్డ్, అస్సాం ఆయిల్ ఫీల్డ్ సంస్థల నుంచి 30 మంది పరిశోధకులు ఐదురోజుల పాటు జిల్లాలో పర్యటిస్తున్నారని తెలిపారు. ఈ పర్యటన అనంతరం సర్వే నివేదిక ప్రచురించి భారత ప్రభుత్వానికి అందజేస్తారని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి వెల్లడించారు.

పోగొట్టుకున్న బంగారు నగల బ్యాగు అప్పగింత


బంగారు నగల బ్యాగును ప్రయాణికురాలికి అందిస్తున్న ఆర్టీసీ కంట్రోలర్, కండెక్టర్లు

పోరుమామిళ్ల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తాను ప్రయాణిస్తున్న ఓ బస్సు ఎక్కాల్సిన మహిళ మరో బస్సు ఎక్కింది. ఈ ఆతృతలో బంగారు నగలున్న బ్యాగును బస్సులో మరిచిపోయింది. ఆ వెంటనే గుర్తించి బస్టాండులో ఉన్న కంట్రోలర్‌కు తెలిపింది. దీంతో ఆయన ఆ బస్సు కండక్టరు నుంచి బ్యాగు తెప్పించి ఆమెకు అప్పగించారు. వివరాల్లోకెళితే... మైదుకూరు నుంచి గిద్దలూరుకు ఓ మహిళా ప్రయాణికురాలు ప్రయాణిస్తోంది. బస్సు పోరుమామిళ్ల బస్టాండుకు చేరుకోగానే ఆమె తన అవసర నిమిత్తం బస్సు దిగింది. తిరిగి ఆమె తొందరలో ఆ బస్సు కాకుండా మైదుకూరు వెళుతున్న బస్సు ఎక్కింది. ఆ వెంటనే గమనించి కిందికి దిగింది. అప్పటికే ఆమె వెళ్లాల్సిన గిద్దలూరు బస్సు వెళ్లి పోయింది. ఆమె ప్రయాణించే బస్సులో తన బంగారు ఆభరణాలున్న బ్యాగు, రెండు వేల నగదు, సెల్‌ఫోన్‌ను మరిచిపోయినట్లు గుర్తించింది. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో ఆమె కంట్రోలర్ నాగరాజును ఆశ్రయించింది. దీంతో ఆయన బస్సు కండక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించి బ్యాగును తెప్పించారు. హ్యాండ్‌బ్యాగ్‌లో ఉన్న 20 గ్రాములు బంగారు ఆభరణాలు, సెల్‌ఫోను, రూ.2వేలు నగదును మైదుకూరు డిపో కండక్టరు మాధవి, గిద్దలూరు డిపో కండక్టరు జయరంగరావు తో కలసి ఆమెకు అందించారు.

ముగ్గురు నిందితుల అరెస్ట్

చిట్వేలి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులను శుక్రవారం మధ్యాహ్నం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రఘురాం తెలిపారు. గురువారం పుల్లంపేట మండలం వత్తలూరుకు చెందిన ఏరుకాళ్ల వెంకటేశ్వర్లు(32) పుల్లంపేట రైల్వేస్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని భార్య రేవతి, ఆమె తండ్రి వెంకటయ్య, తమ్ముడు వంశీలు వేధించడంతో తమ కుమారుడు మృతి చెందాడని వెంకటేశ్వర్లు తల్లిదండ్రులు చిట్వేలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టి కేఎస్ అగ్రహారం పంచాయతీ రాపూరు క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసి.. రాజంపేట కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

శతాధిక కవి సమ్మేళనం

కడప కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర మున్సిపల్ మైదానం వద్ద గల ఐఎంఏ హాలులో వచ్చే ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జిల్లా రచయితల సంఘం రెండో మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మూల మల్లికార్జునరెడ్డి వెల్లడించారు. ఇందులో రాయలసీమ భాష, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం అనే అంశాలపై శతాధిక సమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయలసీమ ఔన్నత్యాన్ని చాటి చెబుతూ 20 లైన్లలో కవిత కానీ, తేటగీతి, ఆటవెలది కంద పద్యాల్లో నాలుగు పద్యాలు కానీ, 2 లేక 3 వృత్త పద్యాలు కానీ 15వ తేదీలోపు జిల్లా శతాధిక కవి సమ్మేళనం అనే వాట్సప్ గ్రూపు లేక 9704651414, 9703912727 అనే నెంబర్లకు మీ కవిత కానీ పద్యాలు కానీ పంపించాలన్నారు. వాటిలో న్యాయ నిర్ణేతల ద్వారా మూడు ఉత్తమ కవితలను ఎంపిక చేసి ప్రథమ విజేతకు రూ.3వేలు, ద్వితీయ విజేతకు రూ.2వేలు, తృతీయ విజేతకు రూ.వెయ్యి బహుమతులు అందజేస్తామన్నారు. తదుపరి కవులు పంపిన ప్రతి కవితను మహాసభల్లో ఆ కవి ద్వారా ఆలాపన చేయించి పెద్దల సమక్షంలో శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరిస్తామన్నారు. ఈసారి మహాసభల్లో విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యతనిస్తామన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు వేమన శతకం, సుమతి శతకం పద్యపఠన పోటీలు, జూనియర్ కళాశాల, డిగ్రీ విద్యార్థులకు కవితల పోటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులోని విజేతలకు కూడా ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులు అందిస్తామని తెలిపారు.

గొరిగెనూరులో ఘర్షణ

- పలువురిపై కేసు నమోదు

జమ్మలమడుగు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరిగెనూరు గ్రామంలో శుక్రవారం ఇరువర్గాలు ఘర్షణపడ్డారు. గ్రామంలో గొంగటి హేమంత్‌రెడ్డి, ఉప్పలూరు ధరణీకుమార్‌రెడ్డి వారికుటుంబసభ్యులు గొడవ పడ్డారు. ఇంటి ఎదురుగా రోడ్డు మీద నీళ్ల విషయంలో ఇరువర్గాలు మాటామాట పెరిగి రాళ్లు రువ్వుకున్నారు. ఈ ఘటనలో హేమంత్‌రెడ్డి, ధరణీకుమార్‌రెడ్డికి చిన్న చిన్న రక్తగాయాలయ్యాయి. వెంటనే జమ్మలమడుగు అర్బన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పై ఇద్దరితోపాటు 14 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు

వేంపల్లె, డిసెంబరు 27: వేంపల్లె మండలం తాళ్లపల్లె ప్రాంతంలో కడపకు చెందిన వ్యక్తి అక్రమంగా అండర్ గ్రౌండ్ మైనింగ్ చేస్తున్నారని విజిలెన్స్ మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో వారు శుక్రవారం తనిఖీ చేశారు. విజిలెన్స్ ఆర్‌ఐ రామసుబ్రమణ్యం, మైనింగ్ ఆర్‌ఐ ఆమని విజయలక్ష్మి ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లారు. రెవెన్యూ అధికారులు గైర్హాజరు కావడంతో హద్దులను గుర్తించేందుకు వీల్లేదని మరో మారు తనిఖీ చేస్తామని తిరిగి వెళ్లారు. అక్రమ మైనింగ్ ఎవరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పక్కా గృహాల సముదాయం పరిశీలన

రామాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టపల్లి పంచాయతీలో పూర్తయిన పక్కా గృహాల సముదాయాలను శుక్రవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. జనవరి 3వ తేదీ సీఎం చంద్రబాబు జిల్లా పర్యటనలో భాగంగా పక్కా గృహాల నిర్మాణాలను సందర్శించనున్నారని తెలిపారు. కాలనీలో రోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, కరెంటు సక్రమంగా ఉన్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. హౌసింగ్ పీడీ సాంబశివరావు, డీఈ సుబ్బరాయుడు, ఏఈ ఏఎన్ఎం ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ, ఐబీపీఎస్, ఆర్‌బీఐలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, పట్టణ కార్యదర్శి సునీత తెలిపారు. శుక్రవారం జేవీవీ కార్యాలయంలో ఉచిత శిక్షణ కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ జనవరి 1 నుంచి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిపుణులైన అధ్యాపకులతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 9705333305లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రవిబాబు, జేవీవీ నాయకులు రాకేష్, పవన్, హర్షిత, చంద్రకళ, అఫ్రోజ్, హరినాథ్, రాజేశ్వరి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడులో అయ్యప్పభక్తుల బస్సుకు ప్రమాదం

- ఆరుగురికి గాయాలు


నిలబడిన లారీని ఢీకొన్న అయ్యప్పస్వాముల బస్సు

దువ్వూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలానికి చెందిన అయ్యప్పస్వాములతో వెళ్లిన బస్సు ప్రమాదానికి గురైంది. ఆలస్యంగా అందించిన సమాచారం మేరకు ఈనెల 24వ తేదీ 38 మంది అయ్యప్ప భక్తులుదువ్వూరు నుంచి శబరిమలకు బస్సులో బయల్దేరి వెళ్లారు. అయ్యప్ప దర్శనానంతరం తిరుగు ప్రయాణంలో తమిళనాడులోని రామేశ్వరంలో దేవుని దర్శించుకుని చాలా దూరం ప్రయాణించారు. 25 తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో నిలబడి ఉన్న లారీని బస్సు వేగంగా వెళ్లి ఢీకొందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సంఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలైయినట్లు బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తులు ‘ఆంధ్రజ్యోతి’కి తెలిపారు. బస్సు చాలా మేరకు ధ్వంసం అయినట్లు చెప్పారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నాం



ప్రదీప్
తహసీల్దార్, ములకలచెరువు

ముఖాముఖి

ములకలచెరువు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా పనులు చేస్తున్నామని ములకలచెరువు తహసీల్దార్ కె.ప్రదీప్ తెలిపారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న: రెవెన్యూ సదస్సులతో ప్రజలకు కలిగే ప్రయోజనాలేమి?

జవాబు: ప్రభుత్వం భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోంది. మ్యుటేషన్, దస్త్రావేజుల్లో మార్పులు(పేర్లు, ఫోన్‌నెంబర్లు, ఆధార్ నెంబర్ల మార్పు) తదితర సమస్యలపై వచ్చే వినతులను 30 రోజుల్లో పరిష్కరిస్తాం. వెబ్ ల్యాండ్‌లో కొత్త ఎంట్రీల కొరకు వచ్చే వినతులను సబ్‌కలెక్టర్ ద్వారా జాయింట్ కలెక్టర్‌కు పంపి వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం.

ప్రశ్న: ఇప్పటికి దాకా ఎన్ని అర్జీలు వచ్చాయి. ఎన్ని పరిష్కరించారు?

జవాబు: ఇప్పటి వరకు ఎనిమిది రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా మొత్తం 339 అర్జీలు వచ్చాయి. వాటిలో 27 సమస్యలను పరిష్కరించాం. మిగిలిన అర్జీలన్నీ గడువులోగా పరిష్కరిస్తాం. వచ్చే నెల 8వతేదీకి రెవెన్యూ సదస్సులు ముగుస్తాయి.

ప్రశ్న: రెవెన్యు సదస్సులకు స్పందన ఎలా ఉంది?

జవాబు: ప్రజల వద్దకే రెవెన్యూ యంత్రాంగం వెళ్లి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు మంచి స్పందన లభిస్తోంది. రైతులు, భూ బాధితులు స్వచ్ఛందంగా వచ్చి సమస్యలపై అర్జీలు సమర్పిస్తున్నారు.

ప్రశ్న: భూ సమస్యలే కాకుండా ఇతర సమస్యలపై అర్జీలు వస్తున్నాయా ?

జవాబు: రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపైనే కాకుండా ఇతర సమస్యలపై వచ్చే అర్జీలు స్వీకరిస్తున్నాం. పింఛన్లు తదితర సమస్యలపై 30 వరకు అర్జీలు వచ్చాయి. వాటిని కూడా ఆన్‌లైన్ చేసి సంబంధిత అధికారులకు పంపాం.

ప్రశ్న: ఇసుకకు అనుమతులు ఎలా ఇస్తున్నారు?

జవాబు: ఇసుక తోలుకోవడానికి అనుమతులు అవసరం లేదు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన ఇసుకను మనుషులతో ఎత్తి ఉచితంగా తోలుకోవచ్చు. యంత్రాలు పెట్టి తోడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

విచక్షణా రహితంగా ఆశా కార్యకర్తపై భర్త దాడి

నిమ్మనపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తన కుటుంబ అవసరాలు తీర్చమన్నందుకు భర్తే విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది. మండలంలోని రాచవేటి వారిపల్లి పంచాయతి దళితవాడకు చెందిన లలితమ్మ(30) స్థానికంగా ఆశా కార్యకర్తగా పనిచేస్తోంది. అయితే తన భర్త వేణుగోపాల్ కుటుంబాన్ని పట్టించుకోకుండా మరో మహిళతో కొన్నేళ్లుగా చనువుగా ఉండడంతో లలితమ్మ నిలదీసింది. దీంతో భర్త వేణుగోపాల్ ఆగ్రహించి లలితమ్మను విచక్షణా రహితంగా కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆమెను మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆటో బోల్తా...ముగ్గురికి గాయాలు

గుర్రంకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడడంతో ముగ్గురికి రక్తగాయాలయ్యాయి. మండలంలోని సరిమడుగుకు చెందిన తోట రెడ్డెన్న(70), సుగవాసి జయమ్మ(68), రత్నమ్మ(60)లు గుర్రంకొండలో జరిగే సంతకు ఆటోలో బయలుదేరి వస్తుండగా పుల్లావాండ్లపల్లె వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వారికి రక్తగాయాలయ్యాయి క్షతగాత్రులను 108లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎంపీడీవోపై దాడి అమానుషం

కురబలకోట, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి అమానుషమని ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట దాడిని నిరసిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహనలో ఉన్న ఆయనపై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. దాడి చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గృహనిర్మాణాలు ముందుకు సాగేనా..?



రంగసముద్రంలో నిర్మాణాల్లో ఉన్న పక్కాగృహాలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో గృహ నిర్మాణాలు పూర్తి ఎప్పుడవుతాయోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2348 గృహాలు మంజూరు కాగా ఇందులో కేవలం 1262 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. బీబీఎల్ లెవెల్‌లో 403 గృహాలు ఉండగా వాటికి వివిధ కారణాలతో ప్రభుత్వం డబ్బులు ఇవ్వలేదు. బీఎల్ లెవెల్‌లో మండల వ్యాప్తంగా 304, లింటల్ లెవెల్‌లో 17 గృహాలు ఉండగా వివిధ గ్రామాల్లో రూఫ్ లెవెల్‌లో 224 గృహాలు ఉన్నాయి. కొన్ని గృహాలు అయితే మోల్డింగ్ వేసి ప్లాస్టింగ్ చేయాల్సినవి 61 గృహాలు ఉన్నాయి. ఇక మండలంలోని వివిధ గ్రామాల్లో 33 గృహాలు ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినా ఇంత వరకు ప్రారంభం చేయక పోవడంతో అదికారులు వాటిని రద్దు చేశారు.

మౌలిక వసతుల్లేక నిలిచిన పనులు

మండలంలోని పెద్దతిప్పసముద్రం, రంగసముద్రం, కందుకూరు, కమ్మచెరువు, పులికల్లు, గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వం సొంత స్థలాలు లేని వారికి గుట్టలు, వాగులు ఉన్న ప్రాంతాల్లో స్థలాల్లో జగనన్న లేఔట్లు కేటాయించింది. ఆయా కాలనీల్లో మౌలిక వసతులు లేక పోవడం, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు ఎక్కడికి చాలక పోవడంతో ఆయా కాలనీల్లో గృహనిర్మాణాలను లబ్ధిదారులు కట్టుకోలేని స్థితిలో వదిలేశారు. కాగా ఇంక కొన్ని చోట్ల జగనన్న గృహాలను కొండలు, గుట్టల్లో స్థలాలు కేటాయించడం అక్కడ గుట్టల్లో నీటి సమస్యలు, సరైన దారి లేక పోవడం వంటి సమస్యలతో లబ్ధిదారులు నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపేశారు. గుట్టల్లో స్థలాలు కేటాయించడం అక్కడికి నిర్మాణ సామగ్రి చేర్చుకోవాలంటే ఖర్చు తడిసి మోపెడవుతుండడంతో లబ్ధిదారులు పనులను నిలిపేశారు.

గృహాలను అమ్ముకుంటున్న లబ్ధిదారులు

మండలంలోని అనేక చోట్ల లబ్ధిదారులు గృహాలను అమ్ముకుంటున్నారు. ప్రైవేటుగా బయటి వ్యక్తులతో బేరాలు కుదుర్చుకుని అగ్రిమెంట్ కాగితాలు రాసుకుని అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ఓ వైపు పేదలకు స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తే కొంత మంది వాటిని అమ్ముకుంటుండడం గమనార్హం.

ముందుకు రాని లబ్ధిదారులు

గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరై వివిధ దశల్లో ఉన్న గృహాలకు ఇప్పుడు వచ్చిన కూటమి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తామని నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ అధికారులు చెపుతున్నా లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. పనులు ప్రారంభిస్తే బిల్లులు మంజూరు చేస్తామని అదికారులు గ్రామాల్లోకి వెళ్లి పదే పదే వివరిస్తున్నా లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

ఇళ్లు అమ్ముతున్నట్లు మా దృష్టికి రాలేదు

మండలంలో ఎక్కడా ప్రభుత్వ గృహాలను అమ్మినట్లు మా దృష్టికి రాలేదు. మా దృష్టికి అమ్మినా కొన్నట్లు వచ్చినా అటువంటి వారిపై కేసులు నమోదు చేసి పట్టాలను రద్దు చేసి పేదలకు పంపిణీ చేస్తాం. ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను ప్రభుత్వ స్థలాలు అమ్మడం కొనడం నేరమని కొన్ని షరతులు పెట్టింది. ఆ షరతులను ఎవ్వరూ ఉల్లంఘించరాదు.

-శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ,
పెద్దతిప్పసముద్రం మండలం

అనవసరంగా కేసులు పెట్టకండి



డీఎస్పీ కొండయ్యానాయుడును కలిసిన శ్రీరామ్‌చినబాబు, బీజేపీ నాయకులు

మదనపల్లె టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో బుధవారం రాత్రి చోటుచేసుకున్న ఘటనపై అనవసరంగా ప్రజలపై కేసులు పెట్టవద్దంటూ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, బీజేపీ నాయకులు డీఎస్పీకి విన్నవించారు. శుక్రవారం స్థానిక డీఎస్పీ కార్యాలయానికి టీడీపీ, బీజేపీ నాయకులు వెళ్లి డీఎస్పీ కొండయ్యనాయుడును కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం రాత్రి మదనపల్లెలో చోటుచేసుకున్న ఘటనను పెద్దది చేసి పోలీసు కేసులు పెడితే చాలా మంది కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. దీనిపై అధికారులు పునరాలోచించాలని కోరారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ విషయం ఎస్పీ దృష్టికి తీసుకెళతామని, మీరు కూడా ఎస్పీని కలసి విన్నవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, బీజేపీ అసెంబ్లీ ప్రతినిధి భగవాన్, జర్మన్‌రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోండి



హెల్మెట్ వాడాలని సూచిస్తున్న సీఐ రమేష్

రామసముద్రం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రాణాలను రక్షణ కవచం లాంటి హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని వాహనవారులను మదనపల్లె సీఐ రమేష్ కోరారు. శుక్రవారం రామసముద్రం మండలానికి విచ్చేసిన ఆయన స్థానిక ఎస్ఐ వెంకటసుబ్బయ్యతో కలిసి అంబేడ్కర్ సర్కిల్‌లో వాహన దారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలలో వాహనదారులు అధిక సంఖ్యలో మృతి చెందుతున్నారన్నారు. అలాగే మద్యం తాగి వాహనాలను నడపడం నేరమని దీనిని అతిక్రమిస్తే రూ.10వేల జరిమానా తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది గంగిరెడ్డి, లోకేష్, శాంతకుమారి, కిరణ్‌యాదవ్, బాలాజి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ అమ్మవారికి విశేషపూజలు

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దతిపసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి అభిషేక పూజలు, లలిత సహస్ర నామం, పూర్ణాహుతి కార్యక్రమాలను కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేదపండితులు నిర్వహించారు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ధర్మపథంలో శనిత్రయోదశి వేడుకలు

వాల్మీకిపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహాలయంలో శనివారం షిరిడీ సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో శనిత్రయోదశి వేడుకలు నిర్వహించనున్నట్లు అర్చకుడు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. శనివారం ఉదయం ఆలయంలో మృత్యుంజయ మంత్ర హోమం, ఏకవార మహారుద్రాభిషేకం మహాతైలాభిషేకం జరుగుతాయన్నారు.

ఘనంగా ఖాదర్‌వల్లి దర్గా ఉరుసు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే హజ్రత్ సయ్యద్ ఖాదర్‌వల్లి ఉరుసుఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బెంగళూరు బస్టాండ్ వద్దనున్న జామియా మసీద్ సమీపంలోని దర్గాను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక దక్నీపేటలోని ఇలియాస్ ఇంటి వద్ద నుంచి గంధంను ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకొచ్చి దర్గాలో ప్రార్థనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాసా దర్గాలో నిర్వహించిన ప్రత్యేక పార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఇలియాస్, జమాల్‌బాషా, షేక్‌గౌస్‌బాసా, మౌలా, తదితరులు పాల్గొన్నారు.

పాతకక్షల కారణంగా శనగవామికి నిప్పు

నిమ్మనపల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పాతకక్షల కారణంగా పొలంలో వేసిన శనగవామికి కొందరు వ్యక్తులు నిప్పు పెట్టిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది.స్థానిక పంచాయతి దేవలం కురవపల్లికి చెందిన రైతు వెంకటరమణ పాడి ఆవుల కొరకు తన వ్యవసాయ పొలంలో శనగవామిని వేసుకొన్నాడు. అయితే పాతకక్షల కారణంగా అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వామికి నిప్పు పెట్టినట్లు తెలిపారు. ఈ విషయమై బాధితుడు స్థానిక పోలీసులకి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

30న మాలల మహాగర్జన ఆత్మీయ సమ్మేళనం

రామసముద్రం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహిస్తున్న మాలల మహాగర్జన ఆత్మీయ సమ్మేళన విజయవంతం చేయాలని మండల మాలమహానాడు అధ్యక్షుడు టి.కృష్ణప్ప కోరారు. ఇందుకు సంబంధించి పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణకు రాజ్యాంగపరంగా పార్లమెంట్‌లో బిల్ పాస్ కావాలని, ఆర్టికల్ 341ప్రకారం వర్గీకరణచేయాలన్నారు. మహాగర్జనలో ప్రతి ఒక్క మాలల కుటుంబ సభ్యులు పాల్గొనాలని కృష్ణప్ప పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో కొమ్ము నారాయణస్వామి, మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజి, గంగప్ప, నరసింహులు, నాగరాజ, రమణ, చంద్రహాస్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మార్చి లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

కలికిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల కోసం నిర్మిస్తున్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను మార్చి నెలాఖరుకు పూర్తి చేయాలని ఎంపీడీవో భానుమూర్తి రావు స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై శుక్రవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పై కప్పు స్థాయికి వచ్చిన ఇళ్లను జనవరి 31 లోగా, ఆలోగా పునాదుల స్థాయి వరకూ ఉన్న వాటిని మార్చి నెలాఖరులోగా పూర్తయ్యేటట్లు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు అవసరమైన విషయాల్లో అన్ని రకాల సహాయ సహకారాలు అందజేయాలని కోరారు. మార్చి నెలాఖరు వరకూ పూర్తి కాని ఇళ్లను రద్దు చేసే అవకాశముందని లబ్ధిదారులకు స్పష్టంగా చెప్పాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీవో సుజాత, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో 17 మంది ఉద్యోగాలకు ఎంపిక

కలికిరి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో 17 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం. వెంకటేశ్వర రావు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో మూడు కంపెనీలు ఈ 17 మందిని ఎంపిక చేసుకున్నట్లు వివరించారు. గత నెలలో ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహించారని, ఎంపికకు సంబంధించిన వివరాలు శుక్రవారం వెల్లడైనట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం నుంచి 9 మంది, ఈఈఈ విభాగం నుంచి నలుగురు, ఈసీ విభాగం నుంచి మరో నలుగురు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ త్యాగరాజన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రమణా రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

పెద్దతిప్పసముద్రం డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నమయ్య జిల్లా సర్వ శిక్షా అభియాన్ ఏపీసీ నాగరత్నంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని మండల విద్యాశాఖాధికారులు నారాయణ, గౌస్‌పీర్‌లతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ఎస్ఏ-1 ప్రగతిని సమీక్షించారు. పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచికరంగా వడ్డించాలని, మెనూలో ఎటువంటి ఫిర్యాదులు అందినా చర్యలు తప్పవని ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌కు సూచించారు. 10వ తరగతి విద్యార్థినులు 100శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. పాఠశాల ఎస్‌వో శైలజతో పాటు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం

తంబళ్లపల్లె, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి తంబళ్లపల్లె ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, ఉపాధ్యాయులు ప్రగాఢ సంతాపం తెలిపారు. శుక్రవారం పాఠశాలలో మన్మోహన్ సింగ్ చిత్ర పటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొద్దిసేపు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుణశేఖర్, షాదిక్, సుధ, హరినాథ్, రెడ్డప్ప, చంద్రశేఖర్, అయాజ్, అయ్యప్ప, శివకుమార్, శోభ, కనుమయి, జ్యోత్స్నప్రియ, షణ్ముకప్రియ, రెడ్డికుమారి, సిబ్బంది, పాల్గొన్నారు.

బస్సులను కండీషన్‌లో ఉంచాలి



బస్సులను తనిఖీ చేస్తున్న జిల్లా ప్రజారవాణాధికారి రాము

మదనపల్లె అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):ఆర్టీసీలోని ఆయా డిపోల పరిధిలో బస్సులను కండీషన్‌లో పెట్టి రోడ్డుపై నడపటానికి ఇవ్వాలని జిల్లా ప్రజారవాణాధికారి రాము ఆదేశించారు. శుక్రవారం టూడిపోలోని బస్సులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులను ఎప్పటికప్పు మరమ్మతులు చేసి సర్వీసులు నడిపించాలన్నారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. డిపోకు, గ్యారేజ్‌లకు అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మెకానికల్ పర్యవేక్షకులు బస్సులను తనిఖీ చేసి లోపాలను సరిచేయాలని చెప్పారు. రోడ్డుపై డ్రైవర్లతో బస్సులను నడిపి తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, గ్యారేజ్ అధికారులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన గంగమ్మకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. రాహుకాల సమయంలో అధిక సంఖ్యలో మహిళలు ఆలయం చేరుకుని అమ్మవారికి చీర, జాకెట్లు, పసుపు, కుంకుమ సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్ర మాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్వారి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యర్శా మార్వారి ప్రభాకర్‌నాయుడు, ట్రేజరర్లు రాటకొండ రంగస్వామి నాయుడు, కరుణాకర్‌నాయుడు, దేవేంద్ర, మార్వారి విక్కీ, మార్వరి మహేష్ శ్రీనివాసులునాయుడు పర్యవేక్షించారు.

30న తంబళ్లపల్లె మండల సమావేశం

తంబళ్లపల్లె, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం హాలులో ఉదయం 11 గంటలకు మండల సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి మండల అధికారులు ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

బొమ్మనచెరువులో భూములను ఫ్రీహోల్డ్ చేయండి

● రెవెన్యూ సదస్సులో అధికారులకు రైతుల వినతి



రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్న ప్రజలు

మదనపల్లె టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం వైసీపీ వర్గానికి చెందిన రైతుల భూములు ఫ్రీహోల్డ్ చేసి, విక్రయాలు చేశారు. ఇప్పుడు అన్ని అర్హతలు ఉన్న మా భూములు కూడా ఫ్రీహోల్డ్ చేయండంటూ మదనపల్లె మండలం బొమ్మనచెరువు రైతులు రెవెన్యూ అధికారులకు విన్నవించారు. శుక్రవారం బొమ్మనచెరువులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ తాతల కాలం నుంచి అనుభవించు కుంటు న్న డీకేటీ, చుక్కల భూములు ఉన్నాయని, వాటిని ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేయాలని కోరారు. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. వాటితో పాటు పాసుపుస్తకాలు, ఇతర భూవివాదాలకు చెందిన అర్జీలను ప్రజలు అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో అమరనా థరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అస్లాంబాషా, కొత్తపల్లె ఉపసర్పంచ్ నందకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవు

వాల్మీకిపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చింతలవారిపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో భూములకు సంబంధించిన సమస్యలను తమ దృష్టికి తెచ్చినట్లయితే త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించి పలు సమస్యలను చర్చించి అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీప్రసన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుగుణ, సర్వేయర్ పూర్ణచంద్ర, వివిధ శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: దీర్ఘకాలికంగా నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్ పేర్కొన్నారు. పెద్దతిప్పసముద్రం మండలంలోని రాపూరివాండ్లపల్లె గ్రామంలో శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన ప్రజల నుంచి అర్జీలను తీసుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు రస్తాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రంగసముద్రం రెవెన్యూ సదస్సులో 51 అర్జీలు వచ్చాయన్నారు. ఈ సదస్సుల్లో సర్పంచ్, అధికారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలం కొట్లపల్లె గ్రామ రెవెన్యూ సదస్సులో రైతులు, ప్రజల నుంచి 16 వినతులు వచ్చినట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. శుక్రవారం కొట్లపల్లెలో రెవెన్యూ సదస్సులో రెవెన్యూ రికార్డులలో సవరణ కొరకు 2 అర్జీలు, దారి సమస్య పరిష్కరించాలని 1, జాయింట్ ఎల్‌పీఎంలను విడగొట్టి ఐబి మంజూరు చేయాలని కోరుతూ 13 వినతులు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ముద్దుక్రిష్ణ యాదవ్, సర్వేయర్ గణేష్, ఎఫ్‌బీవో రామరాజు, దేవదాయశాఖ రికార్డు అసిస్టెంటు కొండకిట్ట, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలకడలో: మండలంలోని కోన పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి 28 ఆర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ ఆర్జీలన్నీ భూముల మ్యుటేషన్‌లకు సంబంధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమలో నోడల్ అధికారి రవిచంద్రబాబు, డీటీ భార్గవి, వీఆర్వో చరితలు పాల్గొన్నారు.

వంక పోరంబోకు స్థలం ఆక్రమణల పరిశీలన



అక్రమ మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు

గుర్రంకొండ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి):గుర్రంకొండ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న సర్వే నెంబరు 503/8లో 1.01 ఎకరాల వంక పోరంబోకు స్థలం ఆక్రమణలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములైన చెరువులు, కుంటలు, వాగులు, వంకలను ఆక్రమిస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వీఆర్వోలు, సర్వేయర్లను అడిగి వంక ఎంతమేర ఆక్రమణలకు గురైందో వివరా లను సేకరించారు. ఆక్రమణలకు గురైన వంక పోరంబోకు స్థలం చుట్టూ ట్రెంచ్ కొట్టి బోర్డును ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే రియల్ వ్యాపారులు అక్రమంగా మట్టి తవ్విన గుట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ అధికారుల అను మతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు సదాశివప్పనాయుడు, అమీర్, సర్వేయర్లు వినోద్ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ర్యాలీ



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే

బి.కొత్తకోట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం బి.కొత్తకోట పట్టణంలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి తమ అనుచరులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్లకార్డులు చేతపట్టి బెంగళూరు రోడ్డులోని వెంకట్రమణస్వామి ఆలయం వద్దనుంచి జ్యోతిసర్కిల్ మీదుగా దిగువబస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌స్టేషన్ వద్దకెళ్లి ట్రాన్స్‌కో ఏఈ గిరిధర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఖలీల్ తో పాటు, తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

పీలేరులో: పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ ఆయన నేతృత్వంలో శుక్రవారం పీలేరులో వైసీపీ శ్రేణులు 'పోరుబాట' పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఈఈ చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యుత్‌చార్జీలపై వైసీపీ నిరసన చేయడం సిగ్గుచేటు

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచుతోందంటూ వైసీపీ రాష్ట్రవ్యాప్తం నిరసనలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్ విమర్శించారు. శుక్రవారం బి.కొత్తకోటలో ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యుత్‌చార్జీల పెంపు ప్రతిపాదన జగన్ హయాంలోనే జరిగిందన్నారు. వైసీపీ అధికారంలో ఉండగా విద్యుత్ చార్జీలు పెంచాలని డిస్కంలు ఈఆర్సీని కోరాయని దీంతో పలుమార్లు చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపిన వైసీపీకి నేడు ధర్నాలు చేసే నైతికహక్కు ఎక్కడుందని ఆమె ప్రశ్నించారు. ఒక యూనిట్ విద్యుత్ రూ.5కే వస్తున్నా, కమీషన్లకు కక్కుర్తి పడి యూనిట్ రూ.8కి కొన్నారన్నారు. జగన్ ప్రభుత్వ పాపాలు నేడు రాష్ట్ర ప్రజలకు శాపాలుగా మారాయని ఆమె ఆరోపించారు. సమావేశంలో నాయకులు చావిడికిట్టన్న, రవికుమార్, ప్రభాకర్, మదార్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని నాశనం చేసి ఇప్పుడు ధర్నాలా..

ములకలచెరువు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగాన్ని నాశనం చేసి ఆరు నెలలు తిరక్కుండానే వైసీపీ ధర్నాలు అంటూ నాటకాలు ఆడుతోందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు పేర్కొన్నారు. మండలంలోని చౌడసముద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనతో జగన్ విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచి బాదిన విషయం ప్రజలు మరిచిపోలేదన్నారు. జగన్ విద్యుత్‌పై ఆడుతున్న కొత్తనాటకాలు చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. . ఈ సమావేశంలో నాయకులు చాంద్‌బాషా, మస్తాన్‌సాబ్, శేఖర్ నాయుడు, బుర్రా రమణ, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు వడ్డెర సంఘం మహాగర్జన

పెద్దమండ్యం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి సంతగేటు వద్ద ఈ నెల 29న (ఆదివారం) జరిగే జిల్లా వడ్డెర సంఘం మహాగర్జన కార్యక్రమం విజయవంతం చేయాలని తంబళ్లపల్లి నియోజక వర్గం నాయకుడు నాగమల్లప్ప పిలుపు నిచ్చారు. శుక్రవారం పెద్దమండ్యం మండలంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర్ల సంక్షేమం, అభివృద్ధి అంశాలపై మహాగర్జనలో మాట్లాడతారని తెలిపారు. వడ్డెర్లు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. శంకరప్ప సాంబశివ, ఎంఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు.